www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar

హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 223 | ఆదివారం | 26 జనవరి, 2025

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681



లంచాల అడ్డాగా మారిన

## తెలంగాణ

- కాంగ్రెస్ ప్రభుత్వంలో పెరిగిన అవినీతి
- గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే సంచలన ఆరోపణలు

02



నేటి నుంచి నాలుగు

# పథకాలకు శ్రీకారం

## దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక


- అర్హుల్లో ఒక్కరికి అన్యాయం జరగొద్దు.. అనర్హులకు చోటు దక్కొద్దు
- పథకాల అమలుపై సీఎం రేవంత్ సమీక్ష
- గ్రామానికో అధికారి చొప్పున పథకాల అమలుకు ఆదేశాలు



**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:** గతంలో హామీ ఇచ్చిన విధంగా ఆదివారం నుంచి నాలుగు కొత్త పథకాలు ప్రారంభిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ పథకాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు, అధికారులతో ఆయన పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. గ్రామాల్లోని లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిజమైన లబ్ధిదారుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగవద్దని సూచించారు. అనర్హులకు లబ్ధి చేకూరిస్తే ఆయా అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు నాలుగు

మిగతా 2 లో

## హైకోర్టులో నలుగురు జడ్జిల ప్రమాణస్వీకారం




02

## కేసీఆర్ సోదరి మృతి



02



ఫోన్ ట్యాపింగ్‌లో

## బిగ్ ట్విస్ట్

- ఏకంగా త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి ఫోన్ ట్యాప్

02



స్కూలు ఆవరణలో

## కండోమ్స్

- ఆవరణ శుభ్రం చేస్తుండగా బయటపడ్డ వైనం

02

పండగ వాతావరణంలో

## పథకాల ప్రారంభం

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ ఆదేశాలు



02



మోడీ ఫోటో

## పెట్టాల్సిందే

- ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడితే ఊరుకునేది లేదు
- రేషన్ కార్డులపైనా ప్రధాని ఫోటో ఉండాల్సిందే
- లేకుంటే ఉచిత రేషన్ పంపిణీని ఆపేస్తాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ హెచ్చరిక

02

కరీంనగర్‌లో బీఆర్ఎస్‌కు

## బిగ్‌షాక్

- కరీంనగర్ మేయర్ రాజీనామా
- బండి సంజయ్ సమక్షంలో బీజేపీలోకి..



ప్రతి అవినీతి వెనకగా


## ఎమ్మెల్యే హస్తం

- ఆయన ఏనాడూ అభివృద్ధి గురించి పట్టించుకోలేదు
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై మేయర్‌సంచలన వ్యాఖ్యలు

03

# బాధ్యత మీపై లేదా?

టెండర్ల వ్యవహారం అసమగ్రంగా ఉంటే ప్రభుత్వాన్ని అడగరా?



అన్ని అంశాలను సరిచూసుకోవాలి కదా!

- కమిషన్ ముందుకు ఆఫ్కాన్స్ సంస్థ ప్రతినిధులు
- పనుల అవకతవకలపై నిలదీసిన కమిషన్ చైర్మన్ ఘోష్

ప్రాజెక్టుల పనులు ప్రారంభించేముందు అన్ని అంశాలను పూర్తి స్థాయిలో సరిచూసుకోవా ల్సిన బాధ్యత నిర్మాణ సంస్థలపై లేదా అని కాళేశ్వరం విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. టెండర్ల వ్యవహారం అసమగ్రంగా ఉన్నప్పుడు వాటి గురించి ప్రభుత్వాన్ని అడగాలని.. ముందే జాగ్రత్తలు తీసుకొని ఉంటే నష్టం జరిగేది కాదని వ్యాఖ్యానించారు.

02

## లక్ష్యం దిశగా దేశం పయనం

ఈ గణతంత్రం మనకు ప్రత్యేకం

- విముక్తి ప్రదాతలను స్మరించుకునే సమయం
- జాతికిచ్చిన సందేశంలో రాష్ట్రపతి ముర్ము

03



## 12మందికి పోలీస్ విశిష్ట సేవా మెడల్స్

ప్రకటించిన కేంద్రం

02



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..






# లంచాల అడ్డగా తెలంగాణ

### కాంగ్రెస్ ప్రభుత్వంలో పెరిగిన అవినీతి
### గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే సంచలన ఆరోపణలు

**ప్రజానావ, హైదరాబాద్ :** రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణ రాష్ట్రం లంచాల అడ్డాగా మారిందని గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలీసు అధికారులు లంచాలు తీసుకోవడంపై ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు రాజాసింగ్ ఒక వీడియో విడుదల చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం లంచాలకు అడ్డాగా మారిపోయింది. ఒకప్పుడు కానిస్టేబుల్, ఎస్ఐ, ఏసీపీ లంచాలు తీసుకోవాలంటే భయం ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత లంచాల దందా పెరిగింది. కరీంనగర్ జిల్లా పరిధిలోని జమ్మికుంట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌కు సంబంధించిన ఓ ఆడియో క్లిప్ వైరల్ అవుతోంది. ఆ ఇన్‌స్పెక్టర్ ఓ కేసులో 3 లక్షలు లంచం తీసుకున్నట్లు ఆ ఆడియోలో ఉంది. ఇన్‌స్పెక్టర్ బాత్రూంలో డబ్బులు పెట్టినట్లు బాధితుడు చెబుతున్నాడు. సీసీటీవీ ఫుటేజీ చెక్ చేయాలని బాధితుడు ఉన్నతాధికారులను వేడుకుంటున్నట్లు ఆడియోలో ఉందని రాజాసింగ్ తెలిపారు. ఇక తన నియోజకవర్గం గోషామహల్ పరిధిలోని షాహినాత్ గంజ్ పోలీసు స్టేషన్‌లో సీఐ ఏ బాబు చౌహాన్.. ఒక కేసు నుంచి పేరు తీసేయాలంటే లక్షా యాభై వేలు అడిగిండు. డీల్ రూ. 50 వేలకు ÷నైల్ అయింది. బాధిత వ్యక్తి నుంచి రూ. 50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయనను అరెస్టు చేశారు. ఈ ఏడాదిలో చాలా వరకు పోలీసులు లంచాలు తీసుకుంటూ అరెస్టు అవుతున్నారు. లంచం మాఫియాపై సీవీ ఆనంద్ దృష్టి పెట్టాలి. పోలీసు అధికారులు వారి ఛాంబర్‌లో కూడా సీసీ కెమెరాలు పెట్టాలని డీజీపీ, సీపీని కోరుతున్నాను. అక్రమంగా కేసు పెట్టిన తర్వాత, ఆ కేసులో పేరు తీసేసేందుకు డబ్బులు అడగడం దారుణం. క్రైమ్‌లో లేని నేను రూ. 50 వేలు ఎందుకివ్వాలని ఏసీబీకి ఫిర్యాదు చేసిండు. మరి క్రైమ్ చేసిన వారి నుంచి ఎంత డబ్బులు వసూలు చేస్తున్నారు..? పోలీసు అధికారులు ఉండే ప్రతి చోట సీసీ కెమెరాలు పెట్టాలి. ఇలాంటి ఆఫీసర్లు లంచాలు తీసుకున్నప్పుడు సస్పెన్షన్ చేయకుండా, జాబ్ నుంచి పూర్తిగా తొలగించాలని, ఇందుకు స్పెషల్‌గా ఒక జీవో తీసుకురావాలని సీఎంకు విజ్ఞప్తి చేస్తున్నాను అని రాజాసింగ్ కోరారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో మరో మలుపు

### త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఫోన్ ట్యాప్



**ప్రజానావ, హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఫోన్ ట్యాపింగ్ అయినట్లు పోలీసులు గుర్తించారు. 2023 నవంబర్ నుంచి 15 రోజుల పాటు ఆయన ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో గవర్నర్ పీఏ నర్సింహ స్టేట్మెంట్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు రికార్డు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ అయిందని ఇంద్రసేనారెడ్డి ఇప్పటికే చెప్పిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా ఆయన పీఏ స్టేట్మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారు.ప్రతిపక్ష నేతలు, ప్రజా సంఘాల నేతలే టార్గెగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని, ఇందులో నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు కీలకంగా వ్యవహరించారని మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్ రావు విచారణలో గుట్టు బయట పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభాకర్?రావును ఈ కేసులో ప్రధాన నిందితుడి(ఏ1)గా పోలీసులు చేర్చారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిన విధానాన్ని విచారణలో దర్యాప్తు అధికారులకు ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న వెల్లడించారు. నాడు ఇంటెలిజెన్స్ చీఫ్?గా ఉన్న ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు ఒప్పుకున్నారు. నాటి ప్రభుత్వ పెద్దలు, ప్రభాకర్ రావు నుంచి అందిన ఫోన్? నంబర్ల ఆధారంగా ట్యాపింగ్ చేసేవాళ్లమని తెలిపారు. వందల సంఖ్యలో ఫోన్ నంబర్స్ అందేవని చెప్పారు. అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఇండ్ల పరిసరాల్లో ట్యాపింగ్ సెంటర్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ప్రభాకర్‌రావుకు అందించేవాళ్లమని తెలిపారు. అసెంబ్లీ ఫలితాలు వెలువడిన వెంటనే ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ట్యాపింగ్ డివైజ్?లు, హార్డ్ డిస్క్?లను ధ్వంసం చేసినట్లు ఈ ముగ్గురూ విచారణలో అంగీకరించినట్టు పోలీసులు ఇప్పటికే పేర్కొన్నారు.

# స్కూలు ఆవరణలో కండోమ్స్

### ఆవరణ శుభ్రం చేస్తుండగా బయటపడ్డ వైనం



**ప్రజానావ, జగిత్యాల:** బడిని గుడిలా భావిస్తారు. గుడిని ఎంత పవిత్రంగా ఉంచుకుంటామో.. బడిని కూడా అంతే పవిత్రంగా ఉంచుకోవాలి. కానీ ఈ పాఠశాల మాత్రం అపవిత్రంగా మారింది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పాఠశాల ఆవరణలో పలు చోట్ల కండోమ్ ప్యాకెట్లు ప్రత్యక్షమయ్యాయి. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జగిత్యాల సీఎస్ఐ బాలికల ఉన్నత పాఠశాలను శుభ్రం చేయించేందుకు ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. అది కూడా అటెండర్లతో కాకుండా.. విద్యార్థినుల చేత శుభ్రం చేయించారు. స్కూల్ ఆవరణలో ఉన్న చెత్తను అమ్మాయిలు ఊడ్చుతుండగా.. వారి కంట కండోమ్ ప్యాకెట్లు కనిపించాయి. ఆందోళనకు గురైన విద్యార్థినులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ టీచర్లు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా మాట్లాడారు. ఈ విషయం మీడియా ప్రతినిధులకు, విద్యార్థినుల తల్లిదండ్రులకు తెలిసింది. దీంతో పాఠశాల హెడ్‌మాస్టర్ సీఎస్ఐ చర్చ సెక్రటరీనీ ప్రశ్నించగా.. సమాజంలో ఇదంతా సహజమేనని, దానికి మేం ఏం చేయాలని నిర్లక్ష్యంగా మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు తాము కాపలా ఉండాలా అంటూ ఉపాధ్యాయుల నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారు. దీనిపై డీఈవో రాములును వివరణ కోరగా వెంటనే ఎంఈఓను పంపించి వివరాలు సేకరించి వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# నేటి నుంచి నాలుగు పథకాలకు శ్రీకారం



మొదటి పేజీ తరువాయి

పథకాలను తెలంగాణ సర్కార్ లాంఛనంగా ప్రారంభించనుంది. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని అన్ని మండలాల్లో మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. నాలుగు పథకాలకు ఒక్కో పథకానికి ఒక్కో అధికారి చొప్పున గ్రామానికి నలుగురు మండలస్థాయి అధికారులను నియమించాలని తెలిపింది. ఫిబ్రవరి మొదటివారం నుంచి మార్చి 31లోగా రాష్ట్రంలోని మిగతా గ్రామాల్లో లబ్దిదారులకు పథకాలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. మార్చి 31 లోపు నాలుగు పథకాలు వంద శాతం అమలు జరిగేలా చూడాలి.. నిజమైన లబ్దిదారులకు ఒక్కరికి కూడా అన్యాయం జరగొద్దు.. అనర్హులకు లబ్ది చేకూరిస్తే అధికారులపై చర్యలు తప్పవని సర్కార్ హెచ్చరించింది. సంక్షేమ పథకాల కోసం లక్షలాది దరఖాస్తులు వచ్చాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. లబ్దిదారుల వెరిఫికేషన్ కోసం గ్రామసభలు నిర్వహించామని, ఇచ్చిన హామీ మేరకు రేపటి నుంచి పథకాల ప్రారంభిస్తామన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. పవిత్రమైన గణతంత్ర దినోత్సవం రోజున ఇచ్చిన మాట ప్రకారం నాలుగు పథకాలు ప్రారంభిస్తున్నామన్నారు. మండలానికి ఒక గ్రామం యూనిట్‌గా తీసుకొని నాలుగు పథకాలు అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. అర్హత కలిగిన ప్రతి వ్యక్తికి పథకాలు అందిస్తామని, మార్చి వరకు ప్రక్రియ పూర్తి చేస్తామని భట్టి స్పష్టం చేశారు. పథకాల్లో ఎలాంటి సీలింగ్ లేదని, అర్హులందరికీ అందిస్తామన్నారు. ఇండ్లు, రేషన్ కార్డుల కోసం ఎక్కువ దరఖాస్తులు వచ్చాయన్నారు. వ్యవసాయం చేసే ప్రతీ ఒక్కరికి రైతు భరోసా ఇస్తామని భట్టి వివరించారు. నాలుగు కొత్త పథకాలు ప్రారంభించబోతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. లబ్దిదారుల ఎంపిక కోసం గ్రామ సభలు నిర్వహించామని చెప్పారు. గ్రామాల్లో పథకాల కోసం లక్షల అప్లికేషన్లు వచ్చాయన్నారు. నవరి 26 నుంచి ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభిస్తామని చెప్పారు. వ్యవయసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా ఇస్తామన్నారు. రేషన్ కార్డుల విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దని చెప్పారు మంత్రి ఉత్తమ్. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తామని తెలిపారు. ఒక్కో వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేపు నాలుగు సంక్షేమ పథకాలు మండలంలోని ఒక గ్రామంలో మధ్యాహ్నం 1 గంటలకు లాంఛనంగా ప్రారంభిస్తామని తెలిపారు. రేషన్ కార్డులు, ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా ఇస్తామని అన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ.. గతంలో దరఖాస్తు ఇచ్చినా, సర్వేలో వివరాలు ఇచ్చినా ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోక పోయినా ఇప్పుడు ప్రజాపాలన కేంద్రాల్లో ఇవ్వండని అన్నారు. బీపీఎల్ కుటుంబాలందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించిందని పేర్కొన్నారు. గత పదేళ్ళుగా దొడ్డు బియ్యం ఇచ్చారు.. మనిషికి ఆరు కిలోల సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇకపై బయట ఆహార పదార్థాలు కొనుక్కోవాల్సి ఉండదని అనుకుంటున్నానన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. భారతదేశంలో రికార్డు స్థాయిలో పంటలు పండించింది తెలంగాణ రైతాంగం అని అన్నారు. దేశంలోనే రూ.7525 కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం.. 21వేల కోట్ల రైతు రుణమాఫీ, 3వేల కోట్ల రైతు భీమా కట్టామని తెలిపారు. రేపట్నుంచి రాహుల్ గాంధీ ఇచ్చిన వాగ్దానాన్ని రైతు భరోసా అమలు చేయబోతున్నా మని అన్నారు. వ్యవసాయం చేసే ప్రతీ ఒక్కరికీ రైతు భరోసా ఇస్తున్నాం.. 40 వేల కోట్లు ఒక్క సంవత్సరంలోనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# నలుగురు జడ్జిలు ప్రమాణస్వీకారం

**ప్రజానావ, హైదరాబాద్ :** తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నియమితులైన నలుగురు అదనపు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. జస్టిస్ రేణుకా యారా, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జస్టిస్ ఇ.తిరుమలదేవి, జస్టిస్ బి.ఆర్.మధుసూదన్‌రావుతో హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్ పాల్ ప్రమాణం చేయించారు. ఇంతకుముందు రేణుక యారా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జిగా, నందికొండ నర్సింగ్‌రావు సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా, ఇ.తిరుమలాదేవి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, విజిలెన్స్ రిజిస్ట్రార్‌గా, బి.ఆర్.మధుసూదన్‌రావు హైకోర్టు రిజిస్ట్రార్(పరిపాలన)గా బాధ్యతలు నిర్వర్తించారు.

# 12మందికి పోలీస్ విశిష్ట సేవా మెడల్స్




**ప్రజానావ, హైదరాబాద్ :** స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ యేటా రెండు సార్లు పోలీసు పతకాలను ప్రకటిస్తుందనే విషయం తెలిసిందే. దీనిలో భాగంగా రిపబ్లిక్ డేను పురస్కరించుకుని తాజాగా పోలీసు పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా మొత్తం 942 మంది ఇలా గ్యాలంట్రీ/సర్వీసు పతకాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం అవార్డుల జాబితాను ప్రకటించింది. ఇందులో 746 మందికి పోలీస్ విశిష్ట సేవా (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్), 101 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 95 మందికి మెడల్ ఫర్ గ్యాలంట్రీ, ఇద్దరికి ప్రెసిడెంట్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ పతకాలను ప్రకటించింది. ఈ పతకాలలో తెలంగాణ నుంచి 12 మందికి పోలీస్ విశిష్ట సేవా (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) మెడల్స్ దక్కాయి. అలాగే తెలంగాణ నుంచి పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మన్, ఎస్పీ మెట్టు మాణిక్ రాజ్ రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఇక ఏపీ నుంచి చీఫ్ హెడ్ వార్డర్ కడాలి అర్జున రావు, వార్డర్ ఉండ్రాజవరపు వీరవెంకట సత్యనారాయణకు కరెక్షనల్ సర్వీస్ విభాగంలో పోలీస్ విశిష్ట సేవా పతాలకు ఎంపికయ్యారు.

# పోచారంలో అక్రమాల కూల్చివేత



**ప్రజానావ, హైదరాబాద్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధి నారపల్లి దివ్యానగర్‌లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఇక్కడి లేఅవుట్స్‌లో రహదారికి అడ్డుగా నిర్మించిన ప్రహరీ గోడలను సిబ్బంది కూల్చివేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ నెల 12న హైడ్రా కమిషనర్ రంగనాథ్ దివ్యానగర్ లేఅవుట్స్‌ను పరిశీలించారు. అక్రమ కట్టడాల నిర్మాణంపై ఆరా తీశారు. అధికారులు సర్వే చేసి ప్రభుత్వ స్థలంలో ప్రహరీ నిర్మించారని గుర్తించారు. తాజాగా శనివారం వాటి కూల్చివేతలు చేపట్టారు.

### పండగ వాతావరణంలో

# పథకాల ప్రారంభం

- మండలానికో గ్రామం ఎంపిక చేసి అందచేత
- గ్రామసభలో లబ్దిదారులు హాజరయ్యేలా చూడాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ ఆదేశాలు



**ప్రజానావ, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను రాష్ట్రంలోని ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులైన వారందరికీ అందించాలని నిర్ణయించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. ఈ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు. ఈ సభకు లబ్దిదారులందరూ హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ పథకానికి సంబంధించి లబ్దిదారుల జాబితాను గ్రామసభలో ప్రముఖంగా ప్రదర్శించాలని తెలిపారు. జాతీయ పర్వదినమైన గణతంత్ర దినోత్సవంనాడు ఈ పథకాలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ శాంతి కుమారి సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సి.ఎం కార్యాలయ కార్యదర్శులు శేషాద్రి, చంద్ర శేఖర్ రెడ్డి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాష్ , పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో ఈ నాలుగు పథకాలను అర్హులైన లబ్దిదారులందరికీ అందించాలని స్పష్టం చేశారు. రేపు, 26 వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఈ పథకాల పండుగను ప్రారంభించాలని తెలిపారు. నాలుగు పథకాలకు గాను రేషన్ కార్డులకు సంబంధించి తహసీల్దార్ నేతృత్వంలో ప్రత్యేక టీమ్, ఇందిరమ్మ ఇండ్లకు గాని ఎండీఓ ఆధ్వర్యంలో, రైతు భరోసాకు మండల వ్యవసాయ అధికారి, డిప్యూటీ తహసీల్దార్ లేదా రెవెన్యూ ఇన్స్పెక్టర్ టీమ్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీ పథకం ఏపీఓ టీమ్ లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని సి.ఎస్ సూచించారు. పథకాల ప్రారంభోత్సవ ఏర్పాట్లు ఈ రోజు సాయంత్రం నుండే మొదలు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ప్రారంభించే ప్రతీ గ్రామానికి మండల స్పెషల్ అధికారి ఇంఛార్జిగా నియమించాలన్నారు. జిల్లా కలెక్టర్లు అర్హుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు.

# కేసీఆర్ సోదరి సకలమ్మ మృతి

**ప్రజానావ, హైదరాబాద్:** బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సోదరి చీటి సకలమ్మ (82) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. శనివారం ఉదయం మునిరాబాద్‌లోని ఆమె నివాసానికి చేరుకున్న కేసీఆర్.. సోదరి పార్థివదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులు, బంధువులను ఓదార్చారు. కెసిఆర్‌తో పాటు కెటిఆర్, హరీష్ రావు తదితరులుకూడా నివాళి అర్పించారు. సకలమ్మ అంతిమయాత్ర కొనసాగుతున్నది. పూడూరులోని స్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు జరిగాయి. అంతిమయాత్రలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు సకలమ్మ 5వ సోదరి. ఆమె స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పెదిర. భర్త హన్మంతరావు కొన్నేండ్ల క్రితమే మృతిచెందారు. వారికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

# బాధ్యత మీపై లేదా?

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:** ప్రాజెక్టుల పనులు ప్రారంభించేముందు అన్ని అంశాలను పూర్తి స్థాయిలో సరిచూసుకోవాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థలపై లేదా అని కాళేశ్వరం విచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. టెండర్ల వ్యవహారం అసమగ్రంగా ఉన్నప్పుడు వాటి గురించి ప్రభుత్వాన్ని అడగాలని.. ముందే జాగ్రత్తలు తీసుకొని ఉంటే నష్టం జరిగేది కాదని వ్యాఖ్యానించారు. అన్నారం బ్యారేజీని నిర్మించిన ఆఫ్కాన్స్ సంస్థ ప్రతినిధులు నాగ మల్లికార్జునరావు, శేఖర్ దాస్ ..కాళేశ్వరం కమిషన్ ఎదుట శనివారం విచారణకు హాజరయ్యారు. గతంలో వారు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించింది. పనులకు సంబంధించిన ఒప్పందాలు, అందులోని అంశాలు, పనుల ప్రారంభం, ఆలస్యానికి గల కారణాలు, తలెత్తిన సమస్యలు, తీసుకున్న చర్యలు, తదితర అంశాలపై వారిని ప్రశ్నించారు. బ్యారేజీ ప్రతిపాదిత లోకేషన్ మార్చడం, భూమి అప్పగింతలో ఆలస్యం జరగడంతోనే పనుల ప్రారంభానికి కొంత సమయం పట్టిందని ఆఫ్కాన్స్ ప్రతినిధులు వివరించారు. సైట్‌కు వెళ్లేందుకు మార్గం కూడా లేకపోవడంతో ఏడాది పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి భూములు లీజుకు తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యమైన పనులు చేసేటప్పుడు అన్ని అంశాలను పూర్తి స్థాయిలో చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని.. కేవలం కాంట్రాక్టు, డబ్బులు వస్తున్నాయి కదా అని మాత్రమే చూసుకుంటే ఎలా అని కమిషన్ ప్రశ్నించింది. వందేళ్లు ఉండాల్సిన బ్యారేజీలో ఏడాదికే సమస్యలు ఎందుకు వచ్చాయని కమిషన్ ప్రశ్నించింది. ఈపీసీ ఒప్పందం అయి ఉంటే సర్వే సహా అన్ని అంశాలను తామే చూసుకునేవాళ్లమని ఆఫ్కాన్స్ ప్రతినిధులు చెప్పారు. ప్రొటెక్షన్ వర్క్స్ విషయమై నీటిపారుదలశాఖతో సంప్రదింపులు జరిపినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ, ధవళేశ్వరం బ్యారేజీ తరహా ప్రొటెక్షన్ వర్క్స్ గురించి చర్చించినట్లు పేర్కొన్నారు. సీసీ బ్లాకులు దెబ్బతిన్న తర్వాత కన్సల్టెన్సీతో అధ్యయనం చేయించామని.. ఆ సిఫార్సులపై నీటిపారుదల శాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. అన్నారం ఆనకట్టకు ఎలాంటి పగుళ్లు రాలేదని, ఒకసారి సీపేజీ సమస్య వస్తే వెంటనే గ్రౌటింగ్ చేసి అరికట్టినట్లు ఆఫ్కాన్స్ ప్రతినిధులు కమిషన్ ముందు తెలిపారు.

# కరీంనగర్‌లో బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్

- కరీంనగర్ మేయర్ సునీల్‌రావు రాజీనామా
- బండి సంజయ్ సమక్షంలో బీజేపీలోకి..



**ప్రజానావ, కరీంనగర్:** కరీంనగర్‌లో బీఆర్ఎస్‌కి బిగ్ షాక్ తగిలింది. బీఆర్ఎస్‌కి కరీంనగర్ మేయర్ సునీల్ రావు రాజీనామా చేశారు. శనివారం మేయర్‌తోపాటు మరో 10మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు బండి సంజయ్ సమక్షంలో వీళ్లంతా బీజేపీ గూటికి చేరారు. బీఆర్ఎస్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు కరీంనగర్ మేయర్ సునీల్‌రావు. అవినీతిని భరించలేకే పార్టీ వీడుతున్నట్టు చెప్పారు. రివర్ ఫ్రంట్, స్మార్ట్ సిటీ.. ఇతర పనుల్లో అవినీతి జరిగిందని..ఆ అవినీతి నేత పేరును త్వరలోనే వెల్లడిస్తానన్నారు. బీఆర్ఎస్ నేతల అవినీతి చిట్టా తన చేతిలో ఉందంటోన్న సునీల్‌రావు.. అవసరం వచ్చినప్పుడు గుట్టు విప్పుతానని టీవీ9తో చెప్పారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. బీఆర్ఎస్‌కు 24 మంది కార్పొరేటర్లు ఉండగా అందులో పది మంది పార్టీ వీడారు. దీంతో బీఆర్ఎస్ బలం 14కు పడిపోనుంది. బీజేపీకి ఇప్పటివరకు 16 మంది కార్పొరేటర్లు ఉండగా బీఆర్ఎస్ నుంచి 10 మంది చేరుతుండటంతో కమలం పార్టీ బలం 26కు చేరుతుంది. కాంగ్రెస్‌కు 12 మంది కార్పొరేటర్లు, ఎంఐఎంకు 8 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఈనెల 26తో కరీంనగర్ కార్పొరేషన్ పాలకమండలి గడువు ముగియనుంది. ఈ సమయంలో మేయర్, కార్పొరేటర్లు బీఆర్ఎస్‌ను వీడటం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ నేత గంగుల కమలాకర్‌కు తనకు గ్యాప్ లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వలసలు మొదలవడం కరీంనగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతుండటంతో కమలం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ మొదలుపెట్టినట్టు తెలుస్తోంది.

# కేంద్రం నిధులిస్తోంది.. మోడీ ఫోటో పెట్టాల్సిందే

- ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడితే ఊరుకునేది లేదు
- రేషన్ కార్డులపైనా ప్రధాని ఫోటో ఉండాల్సిందే
- లేకుంటే ఉచిత రేషన్ పంపిణీని ఆపేస్తాం
- కేంద్రమంత్రి బండి సంజయ్



**ప్రజానావ, కరీంనగర్:** ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరుతో కేంద్రం మంజూరు చేసిన ఇళ్లకు 'ఇందిరమ్మ' పేరు పెడతానంటే ఒక్క ఇల్లు కూడా మంజూరు చేసే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ తేల్చి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ పేరు పెడితే కేంద్ర ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా ఇవ్వదని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరు పెడితేనే నిధులు ఇస్తామన్నారు. కాంగ్రెస్ ఫొటోలు పెడితే రేషన్ కార్డులు ఇవ్వబోమన్నారు. తామే ముద్రించి ప్రజలకు రేషన్ కార్డులు ఇస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మాజీ సీఎం కేసీఆర్ మీద ఆయన విమర్శలు గుప్పించారు. కొత్త రేషన్ కార్డులపై సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రధాని మోదీ ఫొటో ముద్రించాల్సిందేనని అన్నారు. రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో పెట్టకపోతే ఉచిత బియ్యం ఎందుకివ్వాలని ప్రశ్నించారు. ప్రధాని ఫొటో పెట్టకపోతే పేదలకు కేంద్రమే నేరుగా ఉచిత బియ్యం అందించే అంశంపై ఆలోచన చేస్తామన్నారు. కరీంనగర్ మేయర్ సునీల్ రావు భాజపాలో చేరిన అనంతరం బండి సంజయ్ మాట్లాడారు. 'ఎప్పుడు ఎన్నికలు జరిగినా కరీంనగర్ కార్పొరేషన్ భాజపాదని అన్నారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చినా గత పదేళ్లలో ఏనాడూ భారాస నేతలు నన్ను పిలవలేదు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు నేను నిధులు తీసుకొస్తే.. వాళ్లు పనులు ప్రారంభించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు నిధులను దారిమళ్లిస్తే.. కొట్లాడి మరీ అడ్డుకున్నానని అన్నారు. కరీంనగర్ కోసం ఎంత కష్టపడినప్పటికీ నన్ను ఏనాడూ ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవకుండా దూరంపెట్టారు. మోదీ ప్రభుత్వం అందించిన నిధులతోనే కరీంనగర్‌లో అభివృద్ధి జరిగిందని ప్రజలకు అర్థమైంది. భారాస పాలనలో అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయింది. మాజీ సీఎం కేసీఆర్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తున్నారు' అని బండి సంజయ్ దుయ్యబట్టారు. రేవంత్‌కు గురువు కేసీఆరేనని బండి సంజయ్ అన్నారు. 'రేవంత్‌కు కేసీఆరే గురువు. కేసీఆర్ ఏం చేశారో.. రేవంత్ అదే చేస్తున్నారు. రేవంత్ పనిలో కొత్తదనం ఏమీ లేదు. ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైంది? కాళేశ్వరం అవినీతి ఎక్కడకు పోయింది? కేసీఆర్‌ను జైల్లో ఎందుకు వేయడం లేదు? రేపే అరెస్ట్ అని ఇంకా ఎన్ని రోజులు అంటారు? ఫార్ములా కారు రేసు కేసులో కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? గ్రీన్ కో కంపెనీ నుంచి కాంగ్రెస్‌కు డబ్బులు ముట్టాయ్. దావోస్‌కు రెండుసార్లు పోయినా.. పెట్టుబడులపై స్పష్టత లేదు. శ్వేత పత్రం విడుదల చేయాలి' అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# ప్రతి అవినీతి వెనకగా ఎమ్మెల్యే హస్తం

## ఆయన ఏనాడూ అభివృద్ధి గురించి పట్టించుకోలేదు

## కరీంనగర్ మేయర్ సునీల్ రావు సంచలన వ్యాఖ్యలు

**ప్రజానావ, కరీంనగర్:** కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై కరీంనగర్ మేయర్ సునీల్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో భాజపాలో చేరిన అనంతరం సునీల్ రావు మాట్లాడారు. 'తెదేపా నుంచి వచ్చినప్పటికీ.. ఇప్పటికీ గంగుల కమలాకర్ ఆర్థిక పరిస్థితి ఏంటి? టెండర్ల తర్వాత కమిషన్లు ముడితే చాలు.. ఆ తర్వాత గంగుల కనిపించరు. ఆ పనుల గురించి అసలు పట్టించుకోరు. కరీంనగర్‌లో జరిగిన ప్రతి కుంభకోణం వెనక ఆయన పాత్ర ఉంది. బండి సంజయ్ కృషితోనే కరీంనగర్ నగర అభివృద్ధి జరిగిందని అన్నారు. అభివృద్ధి కోసమే తాను బిజెపిలో చేరానని అన్నారు. కరీంనగర్ అభివృద్ధిని గంగుల కమలాకర్ ఏనాడూ పట్టించుకోలేదు. డ్రైనేజీ నీళ్లు మళ్లించకుండా మానేరు రివర్ ఫ్రంట్ పేరిట నిధులు వృథా చేశారు. నగర అభివృద్ధి ఆగిపోవద్దని నేను ఇంతకాలం సైలెంట్‌గా ఉన్నా. చెక్‌డ్యామ్‌లు ఎందుకు కొట్టుకుపోయాయి? చెక్‌డ్యామ్‌లు, రోడ్ల కాంట్రాక్టర్లంతా గంగుల బినామీలే. నాకు మేయర్ పదవి రాకుండా ఆనాడే అడ్డుపడ్డారు. కేవలం కేంద్ర నిధులతోనే నగర అభివృద్ధి జరిగింది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగురవేస్తాం. మరికొంత మంది కార్పొరేటర్లు భాజపాలో చేరుతారు' అని సునీల్‌రావు తెలిపారు.





# లక్ష్యం దిశగా దేశం పయనం

- ఈ గణతంత్రం మనకు ప్రత్యేకం
- విముక్తి ప్రదాతలను స్మరించుకునే సమయం
- జాతికిచ్చిన సందేశంలో రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ,జనవరి25 :**ఈ గణతంత్ర దినోత్సవం మనకు మరింత ప్రత్యేకమైందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతోంది. దేశం మొత్తం గర్వించదగిన సందర్భం ఇది. మన లక్ష్యాల దిశగా నిజమైన ప్రయాణం సాగుతోందని ఆమె అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. 'అంతర్జాతీయంగా నాయకత్వం వహించేలా భారత్ ఎదిగింది. భరతమాత విముక్తి కోసం త్యాగాలు చేసిన వారిని స్మరించుకోవాల్సిన తరుణమిదని అన్నారు.. ఈ ఏడాది బిర్సా ముండా 150వ జయంతిని జరుపుకొన్నాం. వెలుగులోకి రాని మరికొందరు ధైర్యవంతులను స్మరించుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలు మార్చుకున్నాం. ఈ ఏడాది కొత్త చట్టాలు రూపొందించి అమల్లోకి తెచ్చాం' అని రాష్ట్రపతి తెలిపారు. ఎన్నో ఏళ్ల పోరాటం తర్వాత 1947 ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి మనకు స్వాతంత్య్రం వచ్చినప్పటికీ, 1950 జనవరి 26న భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చింది. మనం ఈరోజు స్వేచ్ఛగా బతుకుతున్నా మంటే స్వాతంత్య్రం కోసం పోరాడిన యోధుల చలవే. అయితే ఈ విషయం గురించి చాలా మందికి తెలియకపోవడం విచారకరం. అలాగే 1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమల్లోకి వచ్చింది... కాబట్టి ప్రతి ఏటా ఇదే రోజున రిపబ్లిక్ డే జరుపుకుంటున్నామని భావిస్తారు. ఇందులో కాస్త నిజం లేకపోలేదు. అయితే దీని వెనుక బలమైన కారణం ఉంది. వాస్తవానికి భారత రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26నే ఆమోదించారు. దీనిని అమలు చేసే తేదీకి ఒక ప్రాముఖ్యత ఉండాలనే ఉద్దేశంతో రెండు నెలలు వేచి ఉన్నారు. లాహోర్ వేదికగా 1930 జనవరి 26న కాంగ్రెస్ పార్టీ జాతీయ సమావేశంలో తొలిసారిగా సంపూర్ణ స్వరాజ్యం తీర్మానం చేశారు. నెహ్రూ సారథ్యంలో రావీ నది ఒడ్డున త్రివర్ణ పతాకం ఎగురవేసి భారతీయుల స్వాతంత్ర సంకల్పాన్ని బ్రిటిషర్లకు గట్టిగా వినిపించారు. అప్పటి దాకా కేవలం రాజకీయ, ఆధ్యాత్మిక స్వాతంత్రం వస్తే చాలు, సంపూర్ణ అధికారం బ్రిటిష్ వారి చేతుల్లోనే ఉండి, దేశం సామంత రాజ్యంగా మిగిలిపోయినా ఫర్వాలేదనుకునేలా ఉన్న రాజకీయ నేతల వైఖరిని జలియన్‌వాలాబాగ్ ఉదంతం ఒక్కసారిగా కళ్లు తెరిపించింది. ఆనాడు సుభాష్ చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ లాంటి నేతలు కాంగ్రెస్ పార్టీలో వేడి పుట్టించి పూర్ణ స్వరాజ్య తీర్మానం ప్రకటన చేయించడంలో సఫలమయ్యారు. ఆ రోజునే స్వాతంత్ర దినోత్సవంగా పరిగణించాల్సిందని కాంగ్రెస్ పార్టీ కూడా దేశ ప్రజలకు పిలుపు ఇచ్చింది. జనవరి 26, 1950 నుంచి బ్రిటీష్ కాలం నాటి భారత ప్రభుత్వ చట్టం -1935 రద్దయ్యింది. భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది. దేశానికి రాజ్యాంగం ఉండాలని భావించిన నాటి దార్శినికులు, మేధావులు రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అధ్యక్షుడిగా డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకోగా, రాజ్యాంగ రచనా ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను నియమించారు. రాజ్యాంగ రచనకు ఎంతోమంది మేధావులు వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, అధ్యయనం చేసి ప్రజాస్వామ్య విధానంలో రూపొందించారు. అనేక సవరణల అనంతరం, 1949 నవంబర్ 26న దీనిని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. భారత రాజ్యాంగాన్ని రూపొందించేందుకు రెండు సంవత్సరాల, 11 నెలల, 18 రోజుల కాలం పట్టింది. రాజ్యాంగ రచనకు మొత్తం రూ.64 లక్షలు ఖర్చయ్యింది. తొలి గణతంత్ర దినోత్సవం నాటికి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ భారత రాష్ట్రపతిగా ఉన్నారు. రాజ్యాంగం అమలైన తర్వాత ఆయన ప్రస్తుత పార్లమెంట్ దర్బార్ హాల్‌లో రాష్ట్రపతిగా ప్రమాణం చేశారు. ఐదు మైళ్ల పొడవున సాగిన పరేడ్ తర్వాత, ఆయన ఇర్విన్ స్టేడియంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అప్పటినుంచి ప్రపంచ దేశాల కూటమిలో సంపూర్ణ స్వతంత్ర దేశంగా భారత్ చేరింది.

# చీనాబ్ వంతెనపై వందేభారత్ రైలు పరుగు

## విజయవంతమైన ట్రయల్‌రన్స్



**న్యూఢిల్లీ,జనవరి 25:** ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన అయిన చీనాబ్ బ్రిడ్జ్‌పై వందేభారత్ రైలు పరుగులు పెట్టింది. ఈ వంతెనపై శనివారం వందేభారత్ రైలు ఫస్ట్ ట్రయల్ రన్స్ నిర్వహించారు. ట్రయల్ రన్స్‌లో భాగంగా శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా స్టేషన్ నుంచి శ్రీనగర్ స్టేషన్ వరకూ వందే భారత్ రైలు పరుగులు పెట్టింది. కాగా, ఇప్పటికే సెమీ హైస్పీడ్ వందే భారత్ రైళ్లు దేశ వ్యాప్తంగా పలు మార్గాల్లో దూసుకెళ్తున్న విషయం తెలిసిందే. ఈ రైళ్లకు ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తున్నది. దీంతో మరిన్ని మార్గాలకు ఈ రైళ్లను కేంద్ర విస్తరిస్తోంది. ఈ క్రమంలోనే ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్ లింక్‌లో కశ్మీర్ నుంచి న్యూఢిల్లీకి అనుసంధానించే వందే భారత్ రైలును ఈ ఏడాది ప్రారంభించేందుకు కేంద్ర సిద్ధమైంది. మొత్తం 272 కిలోమీటర్ల మేర ఉధంపుర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టును నిర్మించారు. ఈ లింక్ ప్రాజెక్ట్ దాదాపు పూర్తైంది. కత్రా, రిసియా మధ్య కొంత మేర పెండింగ్‌లో ఉంది. ఇది మరికొన్ని రోజుల్లోనే పూర్తి కానుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యాక రైళ్లు రియాసి జిల్లాలోని అంజి వంతెన, చీనాబ్ వంతెన ద్వారా ఉధంపూర్, జమ్ము, కాట్రా గుండా వెళతాయి. సంగల్దాన్, బనిహాల్ మీదుగా నేరుగా శ్రీనగర్, బారాముల్లా చేరుకుంటాయి. దీంతో రోడ్డు మార్గంతో పోలిస్తే ఆరు గంటలు ఆదా అవుతుంది. ప్రయాణం కూడా చాలా సులభతరం. ఇక కశ్మీర్ లోయ వరకూ సౌకర్యవంతంగా ప్రయాణాన్ని అందించేందుకు ఈ మార్గంలో నడిచే మొదటి రైలుగా వందేభారత్‌ను ఎంపిక చేశారు. ఇందులో భాగంగానే ఈ రైలుకు ప్రత్యేక ఫీచర్లు అనుసంధానించారు. కశ్మీర్ లోయలో అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు ఉంటాయి. దీంతో బయట విపరీతమైన మంచు కురుస్తున్నా లోపల ఉన్న ప్రయాణికులు వెచ్చదనాన్ని ఆస్వాదించేలా ఈ రైలును రైల్వే శాఖ ప్రత్యేకంగా రూపొందించింది. తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా రైల్లోని నీరు గడ్డకట్టకుండా ఉండేందుకు అధునాతన వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. ఇక వందేభారత్ టికెట్ ధర విషయానికి వస్తే.. ఢిల్లీ నుంచి కశ్మీర్‌కు కేవలం రూ.1,500 నుంచి రూ.2100గా నిర్ణయించినట్లు తెలుస్తున్నది. రైలు మార్గమధ్యలో జమ్మూ, శ్రీమాతా వైష్ణోదేవి కత్రాలో స్టాప్స్ ఉండనున్నట్లు సమాచారం.

# ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం

## భారత్ , ఇండోనేసియా మధ్య పలు ఒప్పందాలు



**న్యూఢిల్లీ,జనవరి25 :** ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత్ , ఇండోనేసియా నిర్ణయించాయి. ముఖ్యంగా రక్షణ ఉత్పత్తుల తయారీ, వాణిజ్య రంగాల్లో పరస్పరం మేలు జరిగేలా ముందుకు వెళ్లేందుకు అంగీకరించాయి. ఈ మేరకు ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో, ప్రధాని మోదీ మధ్య జరిగిన సమావేశంలో ఒప్పందం కుదిరింది. సుబియాంతో మూడు రోజుల భారత్ పర్యటనకు వచ్చిన సంగతి తెలిసిందే. ఆదివారం దిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శనివారం సమావేశం ముగిసిన అనంతరం ఇరుదేశాల నేతలు మీడియాతో మాట్లాడారు. భారత్‌కు ఇండోనేసియా కీలక భాగస్వామి అని మోదీ వ్యాఖ్యానించారు. 10 సభ్యదేశాలు కలిగిన ఆసియాన్‌తో పాటు ఇండో పసిఫిక్ కూటమిలో ఇండోనేసియాకు భారత్ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సంబంధాలను నెరపేందుకు ఇరుదేశాలు అంగీకరించినట్లు తెలిపారు. ద్వైపాక్షిక విధానాలకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించినట్లు మోదీ వెల్లడించారు. రక్షణ ఉత్పత్తుల తయారీ రంగంలో భారత్, ఇండోనేసియా కలిసి పని చేయబోతున్నట్లు చెప్పారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనానౌకల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో సముద్ర రక్షణను బలోపేతం చేసే దిశగా ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందం జరిగింది. కృత్రిమమేధ, ఇంటర్నెట్, డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనపై ఇరుదేశాలు పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకున్నాయి. ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు ఇండోనేసియా కూడా సిద్ధంగా ఉందని ఆ దేశ అధ్యక్షుడు సుబియాంతో అన్నారు. ఫిన్‌టెక్, ఏఐ, ఐవోటీ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్టక్చర్ వంటి రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# ఇళ్లలో అసలైన లబ్ధిదారులు ఎవరు?

- నియోజకవర్గానికి మంజూరైంది 3500 మాత్రమే!
- లిస్ట్‌లో మండలవ్యాప్తంగా 4596 మంది లబ్ధిదారులకు ఇండ్లు



**ప్రజానావ, బెజ్జంకి:** బెజ్జంకి మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ నివాసంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీనియర్ నాయకుడు లింగాల లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షుడు దుంబాల రాజమహేందర్ రెడ్డిలతో కలిసి మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు మండలవ్యాప్తంగా 4596 లిస్ట్ మాత్రమే చదివారు. కానీ నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయని, అందులో మన మండలానికి ఎన్ని, గ్రామాలకు ఎన్ని వస్తాయో కాంగ్రెస్ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక రేషన్ కార్డుల కోసం 10339 మంది దరఖాస్తు చేసుకున్నారని, భూమి లేని నిరుపేదలకు ఆత్మీయ భరోసా ఇస్తాం అని చెప్పి, నేడు మండల వ్యాప్తంగా నేడు 994 మందికి మాత్రమే ఇస్తుందని విమర్శించారు. కనీసం రైతు భరోసాను 35శాతం కూడా ఇవ్వట్లేదని మండిపడ్డారు. మేనిఫెస్టోలో భూమి లేని రైతులకు ఇస్తామని చెప్పి, నేడు జాబ్ కార్డ్, 20 రోజులు ఉపాధి హామీకి వెళ్లాలని కొర్రీలు పెట్టడం తగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ఇళ్ళు ఇస్తామని పేదలను, ఆత్మీయ భరోసా పేరిట రైతు కూలీలకు మోసం చేస్తోందని విమర్శించారు. గ్రామ సభల్లో కాంగ్రెస్ అబద్ధపు హామీలకు అన్ని పార్టీలు నిరసనలు చేపడుతున్నాయని, ఆయా గ్రామాల్లోని ప్రజలు కూడాహా తమ గోడు వెళ్లబోసుకుంటున్నారన్నా కాంగ్రెస్ నేతలు మాత్రం బీఆర్ఎస్ నేతలే నిరసనలు తెలుపుతున్నారని అనడం అవివేకమన్నారు. మండలంలోని రేగులపల్లి, బేగంపేట, దాచారం, కల్లెపల్లి గ్రామాల్లో ప్రజలు నిరసన తెలిపారని, తిమ్మాయిపల్లి గ్రామంలో సైతం గ్రామ సభను బహిష్కరించారు అని తెలిపారు. శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం అవి అప్లికేషన్లు మాత్రమేనని, సెలక్షన్ లిస్ట్ కాదని తెలిపినా స్థానిక నేతలు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు.

### 500 మంది పేర్లు మాత్రమే చదివారు!

బెజ్జంకి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు 1064 పేర్లు వస్తే, 500 పేర్లు మాత్రమే అధికారులు చదివారు. నియోజకవర్గంలో ఇస్తానని చెప్పిన ఇండ్ల కంటే బెజ్జంకి మండలంలో ఎక్కువ వచ్చాయని, అందరికి ఎలా ఇస్తారో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీలో మొదటి దఫా 2256 రైతులకు, రెండో దఫా 1321 మంది, మూడో దఫా 1070 రైతులకు మాఫీ అయ్యింది. నాలుగో దఫా రైతు సంబరాలు చేసుకున్నారు. 706 మంది రైతులకు రుణమాఫీ అయ్యిందని చెప్తే అందులో 36 మందికి మాత్రమే తమ బ్యాంక్ అకౌంట్ లో డబ్బులు జమ అయ్యాయని, మిగతా వారికి ఇప్పటికీ డబ్బులు జమ కాలేదన్నారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ అని చెప్పి, 2లక్షల లోపు వారికి కూడా ఇంతవరకు మాఫీ కాలేదని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. రైతు భరోసా రూ.15వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామనడం సరికాదన్నారు.


### కొత్తగా ఎవరికీ రాలేదు..

రేషన్ కార్డులు గతంలో అప్లికేషన్ పెట్టుకున్న వారికి మాత్రమే వచ్చాయని, కొత్తగా ఎవరికీ రాలేదన్నారు. ఇంకా కుటుంబంలో అందరి పేర్లు కూడా నమోదు కాలేదని తెలిపారు. శుక్రవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ మీడియా సమావేశమంతా తప్పుల తడక అని, కాంగ్రెస్ నేతలు మాట్లాడే దాంట్లో పసలేదని, రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభల్లో ప్రజలు, పార్టీలు అందరూ నిరసనలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఇసుక, మట్టి అక్రమ రవాణాల్లో కాంగ్రెస్ నాయకులు కమీషన్లు తీసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ బండి రమేశ్ యాదవ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ముక్కిస తిరుపతి రెడ్డి, ఎలుక దేవయ్య, నలువాల స్వామి, గుబిరె మల్లేశం, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎల శేఖర్ బాబు, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బిగుల్ల మోహన్, పట్టణ అధ్యక్షుడు వంగల నరేశ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కల్లూరి రమేశ్, విద్యార్థి విభాగం మండల ఉపాధ్యక్షుడు బిగుల్ల దుర్గ సుదర్శన్, లింగాల బాబు, తాడిచెట్టు భూమయ్య, లింగాల అర్జున్, బోనగిరి నవీన్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రాగుల మహేశ్, దేవస్థానం మాజీ డైరెక్టర్ దొంతరవేణి ఓదెలు, మాతాంగి శేఖర్, వడ్లూరు గ్రామ శాఖ అధ్యక్షుడు కుంభం రవి, మోగిలి తిరుపతి, కిషన్, లింగారావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రహసనంగా ఓటర్ల దినోత్సవం!

ఏటా జాతీయ ఓటర్ల దినోత్సవం ఓ ప్రహసనంగా సాగుతోంది. దేశ ఓటర్లలో చైతన్యం కలిగించడంలో.. పక్కాగా ఆధార్ తరహాలో ఓటరు కార్డు అందించడంలో... కచ్చితంగా పౌరులంతా ఓట్లు వేసేలా చర్యలు తీసుకోవడంలో...ఎన్నికల సంఘం విఫలం అవుతూనే ఉంది. ఒక్క శేషన్ కాలంలో తప్ప ఎప్పుడు కూడా ఎన్నికల సంఘం పటిష్టంగా పనిచేయలేకపోయింది. ఎన్నికల సంఘం ఉందన్న భయం లేకుండా పోయింది. ఓట్లు నమోదు చేసుకోవడం మొదలు, ఓట్లను నిలబెట్టుకోవడం, అడ్రస్ మార్పించుకోవడం వంటివన్నీ ఓ ప్రహసనంగా మారాయి. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రభుత్వం ఏర్పడడానికి ఓటే ఆయుధం. కానీ ఆ ఓటు బలంగా, నిర్భయంగా వేయగలిగేలా చర్యలు తీసుకోవడం లేదు. ఎన్నికల్లో 40,50 శాతం మించి ఓట్లు నమోదు కావడం లేదు. ఓటేయకున్నా ఫర్వాలేదన్న వాదన బలపడి పోయింది. ఓటేయకుంటే క్రమశిక్షణా చర్యలు లేవు. దేశంలో పక్కాగా ఓటు నమోదు..పక్కాగా ఓటరు కార్డు, ఓటేయకపోతే చర్యలు వంటివి ఉండాల్సింది. అప్పుడే జాతీయ ఓటరు దినోత్సవానికి అర్థం ఉంటుంది. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా నిర్వహిస్తున్నాయి. ప్రతి ఏటా జనవరి 25న భారతదేశం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటోంది. 1950లో భారత ఎన్నికల సంఘం స్థాపించిన రోజును గుర్తు చేసుకుంటూ కేంద్రం ప్రతి ఏటా వేడుకలు నిర్వహిస్తోంది. ఎన్నికల్లో ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు, ఓటింగ్ ప్రాముఖ్యత తెలియజేసేందుకు 2011 నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్న నేపథ్యంలో వారిని ఓటింగ్ వైపు పోత్సహించేలా ఏటా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'నథింగ్ లైక్ ఓట్.. ఐ ఓట్ ఫర్ ష్యూర్' థీమ్‌తో దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అయితే ఓటేయకుండా ఉంటున్న వారిలో అత్యధిక శాతం యువతే అని గుర్తించాలి. దేశంలో యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించేందుకు 2011లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ప్రవేశపెట్టారు. చాలా మంది అర్హత గల యువత ఓటర్లుగా నమోదు చేసుకోవడం లేదని అప్పటి కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ సమస్యను అధిగమించేందుకు చొరవ చూపింది. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని అప్పటి ప్రభుత్వం.. యువతను ఓటర్లుగా నమోదు చేయించడం, వారికి ఓటర్ గుర్తింపు కార్డులు మంజూరు చేయడంపై దృష్టి పెట్టింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం అమలు లోకి వచ్చిన రోజును ఒక ప్రత్యేక దినోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించింది. దానికి జాతీయ ఓటర్ల దినోత్సవంగా నామకరణం చేసింది. అప్పటి నుంచి ప్రతి ఏటా జనవరి 25న వేడుకగా ఈరోజును క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. అయితే ప్రజల్లో నిర్లిప్తత, రాజకీయాల ప్రమేయం వంటివన్నీ దీనిని నీరుగారుస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్క ఓటరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవడం జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రధాన ఉద్దేశం. అందు కోసం ఈ రోజున వారికి ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, 18సంవత్సరాలు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయిస్తుంటారు. అలాగే ఎన్నికల ప్రక్రియలో వారంతా చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించడం ఓటర్ల దినోత్సవ ప్రధాన లక్ష్యం. మొదటిసారి ఓటర్‌గా నమోదు చేసుకునే వారికి సహాయం చేయడం, నూతన ఓటర్ గుర్తింపు కార్డులు అందించడం వంటి పనులు అధికారులు చేస్తుంటారు. అలాగే ఓటింగ్ ప్రాముఖ్యత తెలియజేసేలా బహిరంగ ర్యాలీలు, చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఓటింగ్ ప్రక్రియ, ఓటు ప్రభావం గురించి అవగాహన కల్పించే ప్రచారాలు చేస్తున్నారు. అలాగే అక్షరాస్యతను ప్రోత్సహించడంలోనూ జాతీయ ఓటర్ల దినోత్సవం కీలక పాత్ర పోషిస్తోంది. 'ప్రతి ఓటు లెక్కింపబడుతుంది. మీ స్వంత ప్రజాస్వామ్యంలో ప్రేక్షకుడిగా ఉండకండి. మీ ఓటు హక్కును వినియోగించుకోండని జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బుల్లెట్ కన్నా బ్యాలెట్ బలమైనది. 'ఓటు విలువైనది. ఇది అత్యంత పవిత్రమైనది. ప్రజాస్వామ్యంలో మనకు ఉన్న అత్యంత శక్తివంతమైన సాధనం ఓటు అన్న విషయాన్ని ఏటేటా గుర్తు చేస్తున్నా..భారతీయ ఓటర్లలో నిర్లిప్తత తొలగించలేకపోతున్నాం. ఓ మంచి నేతను ఎన్నుకో వాలంటే ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం లాంటిది. అందుకే ప్రజలు కూడా ఓటు విలువ తెలుసుకోవాలి. లేకుంటే ఎవరో కొందరు ఎన్నికవుతూ..మనమీద స్వారీ చేస్తుంటారు. మనం ఓటు వేయ కున్నా పాలకులుగా ఉంటారు. ఇదిలావుంటే ఎన్నికల సంఘం అధికార పార్టీకి కీలుబొమ్మగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల సంఘం పనితీరుపై భాజపా, కాంగ్రెస్‌ల మధ్య పోస్టల వార్ నడిచింది. ఈసీపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించగా.. కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేశారు. నిజానికి ఎవరు అధికారంలో ఉన్నా ఇసి పనిచేసుకునేలా చేయడం లేదు. వేలుపెట్టడం ఎక్కువైంది. జాతీయ ఓటర్ల దినోత్సవం అనేది శక్తిమంతమైన మన ప్రజాస్వామ్యానికి గుర్తు. ఇది ప్రతి పౌరుడికి తన ఓటు హక్కును వినియోగించుకొనే అవకాశాన్ని కల్పిస్తుంది. మన భవిష్యత్తుకు ఇది ఎంతో ప్రాముఖ్యమైనది. ఈ విషయంలో ఎన్నికల సంఘం పనితీరును మెరుగు పర్చుకుని స్వతంత్రంగా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయి. పోలింగ్ పక్రియను ఆధునికీకరించడంతో పాటు ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా, ఓటు నమోదును పద్ధతిగా చేసేలా ప్రక్రియను బలోపేతం చేసేందుకు ఈసీ కృషి చేయాల్సి ఉంది. అయితే గత పదేళ్లుగా భారత ఎన్నికల సంఘం పనితీరు క్షీణించిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఎవరెన్ని విమర్శలు చేసినా... మన ఎన్నికల పక్రియ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలందుకొని, ఆదర్శంగా నిలిచిందనే చెప్పాలి. ప్రతి పౌరుడికి ఓటుహక్కు అనేది పట్టణస్థాయి నుంచి అట్టడుగు స్థాయి వరకు విస్తరించింది. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి మన సంస్థల స్వతంత్రతను కాపాడుకోవడం ముఖ్యం. అందుకు మరింతగా ఇసి బలోపేతం కావాల్సిన అవసరం ఉంది.



# జాతర గోడ ప్రతి ఆవిష్కరించిన విప్



**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని నాగయ్యపల్లిలో శ్రీ దుబ్బరాజేశ్వరస్వామి వారి జాతర గోడ ప్రతి (వాల్ పోస్టర్ )ను శనివారం వేములవాడ పట్టణంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్వామివారి జాతరలో భాగంగా ఈనెల 28 న మాఘ అమావాస్య రోజున శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాలు, 29 బుధవారం ఉదయం 4 గంటలకు శ్రీ శివ కళ్యాణం, రథోత్సవం కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో వేములవాడ, పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి రాజు, వైస్ చైర్మన్ బింగి మహేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాకేశ్, రూరల్ మండల అధ్యక్షుడు వాకులాభరణం శ్రీనివాస్, సాగరం వెంకటస్వామి, చిలుక రమేశ్, మైలారం రాము, అరుణ్, తేజ చారి, తిరుపతి రెడ్డి, రొండి లక్ష్మణ్, కొమురయ్య, వెంకటేశ్, కొండయ్య, శ్రీకాంత్ తదితరున్నారు.

# ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు

**రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, సస్పెక్ట్లపై నిరంతర పర్యవేక్షణ**

**పాత నేరస్తులు సత్ప్రవర్తనతో జీవితాలను సరిదిద్దుకోవాలి**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ప్రజానావ, సిరిసిల్ల:** ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ రకాల నేరాల్లో నిందితులుగా ఉండి రౌడీ షీట్లు, హిస్టరీ షీట్లు, సస్పెక్ట్స్ గా ఉన్న వారికి కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాత నేరస్తులు సత్ప్రవర్తనతో జీవితాలను సరిదిద్దుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నిందితులుగా ఉన్నవారు విధిగా పోలీసులు తెలిపిన సమయాల్లో పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని, లేదంటే బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. రౌడీ, హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాలకు దూరంగా ఉండటంతో పాటు సత్ప్రవర్తనతో మెదులుతున్న వారిని గుర్తించి వారిపై ఉన్న షీట్స్ ను తొలగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, రామ్మోహన్, శ్రీకాంత్, రమాకాంత్, గణేశ్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.






షేక్‌పేట ఎమ్మార్వో అనిత రెడ్డి

# జూబ్లీహిల్స్‌లో అక్రమ కట్టడాలు

**అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది**

**ప్రజానావ, ఖైరతాబాద్:** జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45,46లో అంబేద్కర్ కాలనీకి అనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాల్లో మళ్లీ అక్రమ కట్టడాలు వెలిశాయి. ఈ విషయాన్ని స్థానికులు షేక్‌పేట ఎమ్మార్వోకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాను శనివారం సిబ్బందితో కలిసి వెళ్లి అక్రమ కట్టడాలను అడ్డుకున్నారు. ఈ అక్రమ నిర్మాణాలకు కూతవేటు దూరంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు ఉండడం విశేషం. గత కొన్నాళ్లుగా ఈ ప్రభుత్వ స్థలంపై కబ్జారాయుళ్ల కన్నువేశారు. గత ప్రభుత్వం ఇదే గుట్ట ప్రాంతానికి సమీపంలో నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం స్థలం కేటాయించింది. కానీ ఆ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రముఖులు ఉండే ప్రాంతం కావడం, కోట్లు విలువ చేసే భూమి కళ్ల ముందు కనిపించడంతో అప్పటి అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల కన్ను ఈ స్థలం పక్కనే ఉన్న గుట్టపై పడింది. అనుకున్నదే తడవుగా గుట్టలను తొలగించి అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. అప్పటి అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఇటు ప్రభుత్వం, అటు అధికార యంత్రాంగం కూడా వీరివైపు చూడలేదు. దీంతో ఆడిందే ఆట.. పాడిందే పాటగా చూస్తుండగానే పెద్దపెద్ద నిర్మాణాలు వెలిశాయి. దీంతో స్థానికులు అప్పటి ఎమ్మార్వోకు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేయగా, వాటిని నిలిపివేయించారు. ఈ అక్రమ కట్టడాలపై గతంలోనే 'ప్రజానావ' దినపత్రిక పలు కథనాలు ప్రచురించగా అధికారులు అడ్డుకున్నారు. కానీ కొందరు కబ్జాదారులు మళ్లీ తమను ఆపేవారే లేరంటూ అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఈ కబ్జాలపై షేక్‌పేట ఎమ్మార్వో అనితా రెడ్డి స్పందిస్తూ ప్రభుత్వ స్థలాలకు సంబంధించి ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# సుభాష్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ ప్రారంభం

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ లో సుభాష్ జంక్షన్, ఆదర్శ అంబేద్కర్ మాల సంఘ కమ్యూనిటీ హాల్ భవనాన్ని శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ స్వాతంత్రం కోసం పోరాడిన సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని, దేశంలోనే రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్ హక్కులను కల్పించిన డా.బీఆర్ అంబేద్కర్ సంఘ భవనాన్ని ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అలాగే తిప్పాపూర్ లోని అంబేద్కర్ జంక్షన్ ను ప్రారంభించడం జరిగిందని, ఇటీవల 10వ వార్డు, 19వ వార్డులోనూ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించడం జరిగిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అన్వేష్, ఏఈ నరసింహస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, స్థానిక కౌన్సిలర్ ఇప్పపూల అజయ్, కౌన్సిలర్లు, ఆదర్శ అంబేద్కర్ మాల సంఘం అధ్యక్షుడు గుండం బాలయ్య, నాయకులు రాపల్లి శ్రీధర్, సాగరం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# ఓటు హక్కు అందరి బాధ్యత

- సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం
- ప్రతిజ్ఞ చేసిన ఉద్యోగులు, సిబ్బంది

**ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో:** ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. 'నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్' అనే థీమ్‌తో 15వ జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఉద్యోగులు ఎలాంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారంఓటర్ నమోదు పెంపు, ఎథికల్ ఓటింగ్ పై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తామని, ఈ సంవత్సరం 'నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్' థీమ్‌తో వేడుకలు జరుగుతున్నాయని వివరించారు.




### విద్యార్థులకు బహుమతులు

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పలు విద్యా సంస్థల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు కలెక్టర్, అదనపు కలెక్టర్ పంపిణీ చేశారు. వ్యాస రచన పోటీల్లో ఈ చైతన్య, కే నికిత, జీ హారిక, సీహెచ్ రోహిత్, సాయి కృష్ణ, కే రాంచరణ్, ఈ ప్రేమ్ కుమార్ విజేతలుగా నిలువగా, బహుమతులు అందజేసి, అభినందించారు. ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న ఎలగందుల బుచ్చయ్య, రదేంశ్ భారతి, ట్రాన్స్ జెండర్ కౌసల్యను శాలువాతో సన్మానించారు.

### నూతన ఓటర్లకు కార్డుల అందజేత

నూతనంగా ఓటరుగా నమోదైన సుద్దాల హర్షవర్ధన్, స్వాతి, జక్కని ధనుష్, దూడం అఖిల, తోట ప్రసన్నాంభికకు నూతన ఎపిక్ కార్డులను కలెక్టర్, అదనపు కలెక్టర్ అందజేసి అభినందించారు. సిరిసిల్లలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ సీఈవో వినోద్, ఎస్డీసీ, సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవో రాధాభాయి, తహసిల్దార్ ఉమారాణి, ఆయా శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గణతంత్ర వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు

**ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో:** గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. ఈ నెల 26న పోలీస్ పెరేడ్ మైదానంలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గణతంత్ర వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. డయాస్, ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు, సౌండ్ సిస్టం, స్వాతంత్ర సమరయోధులకు అధికారులు, సిబ్బంది, ప్రజలకు అవసరమైన మేలు కుర్చీలు, తాగునీటి సరఫరా వంటి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పేర్కొన్నారు. జనవరి 26 న ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, అనంతరం ప్రజా ప్రభుత్వంలో ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసం చేస్తున్న పనులను వివరిస్తూ కలెక్టర్ సందేశాన్ని అందిస్తారని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు పంపిణీ కార్యక్రమం ఉ ంటుందన్నారు. ఆయన వెంట సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ లావణ్య, డీపీఆర్వో వీ. శ్రీధర్, సిరిసిల్ల తహసీల్దార్ ఉమారాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉల్లంపల్లికి ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభం

**ప్రజానావ, హుస్నాబాద్:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నుంచి మడద, ఉల్లంపల్లి, బంటుపల్లి, సుందరగిరి, చిగురుమామిడి మీదుగా కరీంనగర్‌కు నూతన బస్ సర్వీసును హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. గతంలో తమ గ్రామాలకు ఉన్న బస్ సర్వీస్ గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో బంద్ అయిందని, తిరిగి ఇప్పుడు మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో తమ గ్రామాలకు తిరిగి బస్ సర్వీస్ ప్రారంభించడం సంతోషంగా ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలు గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సు వెళుతుందని పేర్కొన్నారు. ఈ బస్సు సర్వీసును మడద, ఉల్లంపల్లి, రాములపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి , హుస్నాబాద్ మండలాధ్యక్షుడు,



మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, మడత గ్రామ శాఖ అధ్యక్షుడు రణధీర్ గౌడ్ , సీనియర్ నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, రాజు గౌడ్, కానవేణి మల్లయ్య, కానవేణి ఉదయ, కొండ కాశీ విశ్వనాథం, కొండ జగన్, రాగుల రమేశ్, కోలా చంద్రమోహన్, జేరిపోతుల రాజు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# తెలంగాణ డైరీ పంపిణీ

**ప్రజానావ, కరీంనగర్:** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఆయా డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగులకు తెలంగాణ సంఘం 2025 డైరీని పంపిణీ చేసిన చేసినట్లు ఆ సంఘం ఎన్జీవోల కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగులంతా సంఘటితంగా ఉండాలని.. సంఘటితంగా ఉంటేనే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం నాయకులు సర్దార్ హరేమేందర్ సింగ్, పట్టణ సంఘం అధ్యక్షుడు మారుపాక రాజేష్, భరద్వాజ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రోడ్డ యాదగిరి, నరసయ్య, రేవంత్, భూమయ్య, విజయ్, వెంకటేశ్వర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.




# ఆర్టీసీని ప్రైవేట్‌కు అప్పగించొద్దు

**ప్రజానావ, కరీంనగర్:** ఆర్టీసీ సంస్థను కాపాడాలని, ఎట్టి పరిస్థితుల్లో ప్రయివేటుకు అప్పగించొద్దని కరీంనగర్ రెండో డిపో ఎదుట శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ ఆర్టీసీని ప్రయివేటుకు అప్పగించి కార్మికుల పొట్టకొట్టొద్దన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, పిట్టల సమ్మయ్య, భామండ్ల పెల్లి యుగేందర్, కంది రవీందర్ రెడ్డి, బోనగిరి మహేందర్, మచ్చ రమేశ్, న్యాలపట్ల రాజు, నాయకులు చెంచల, మురళి, ఓర్సు కొమురయ్య, సత్యనారాయణ, ముత్యాల శ్రీనివాస్ రెడ్డి, కాల్వ శ్రీనివాస్, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా అధ్యక్ష్య పదవి ఎస్సీలకే ఇవ్వాలి : ఏమాజీ

**ప్రజానావ, బెల్లంపల్లి:** మంచిర్యాల జిల్లాలో బీజేపీ బలపడాలంటే జిల్లా అధ్యక్ష పదవి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులకు అప్పగించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఏమాజీ, మాజీ



ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో సుమారు ఆరు లక్షల మంది ఓటర్లు ఉంటే అందులో మూడు లక్షల ఓటర్లు దళితులే ఉన్నారన్నారు. జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో బెల్లంపల్లి, చెన్నూరు ఎస్సీలకు రిజర్వ్ చేయబడ్డాయని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ కూడా ఎస్సీలకే రిజర్వ్ అయిందని గుర్తుచేశారు. పార్లమెంట్ పరిధిలోని ధర్మపురి నియోజకవర్గం కూడా ఎస్సీలకే రిజర్వ్ అయిందన్నారు. పార్లమెంట్ పరిధిలో సగం ఓటర్లు దళితులే ఉన్నారని, పార్టీ పదవుల్లో వారికి బాధ్యతలు అప్పగించి పార్టీని విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాజీ, జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కార్యదర్శి నవీన్, సురేశ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేశవ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ దేవరాయలు, సీనియర్ నాయకులు అజ్మీర శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కమల, న్యాయవాది సంగీత, స్రవంతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రావణ్, రాములు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదు కార్యక్రమం



**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో యువ చైతన్య దీపం ఫౌండేషన్, మండల ఇన్‌చార్జి కొమ్ము ప్రశాంత్ ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. యువకులు, కుల సంఘాల పెద్దలు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో సభ్యతం తీసుకున్నారు. ఈ సందర్భంగా నాగారం గ్రామ అధ్యక్షుడిగా బొడ్డు శంకరయ్యను శేఖర్ సేనాపతి, ప్రశాంత్, ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ ఉపసర్పంచ్ నాగరాజు, బొడ్డు భూమయ్య, భాస్కర్, శివ, కొమ్ము చంద్రయ్య, శేఖర్, నర్సయ్య, శివరాజు, భూమయ్య, దేవరాజు, అశోక్, ముత్తయ్య, యువకులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా యూసుఫ్ తొలగింపు

### ఉత్తర్వులు జారీ చేసిన ఐ అండ్ పీఆర్ కమిషనర్

**ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నుంచి సిఫార్సు చేయబడిన, రాజన్న సిరిసిల్ల జిల్లా అక్రిడిటేషన్ కమిటీ (2022-2024) సభ్యుడిగా ఉ న్న యూసఫ్ అలియాస్ యూసూబ్‌ను అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా తొలగిస్తూ ఐ అండ్ పీఆర్ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా ఉన్న యూసఫ్ అలియాస్ యూసూబ్‌పై పలు ఆరోపణలు, ఫిర్యాదులు, కేసులు నమోదు కాగా, పోలీసులు విచారణ చేపట్టి పూర్తి వివరాలు ఐ ఆండ్ పీఆర్ కమిషనర్‌కు పంపించారు. దీంతో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా ఉన్న యూసఫ్ అలియాస్ యూసూబ్‌ను తొలగిస్తూ ఐ అండ్ పీఆర్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# బద్దెనపల్లి ఉప ఆరోగ్య కేంద్రం తనిఖీ



**ప్రజానావ, సిరిసిల్ల:** కలెక్టర్ ఆదేశాల మేరకు చీర్లవంచ పీహెచ్‌సీలోని బద్దెనపల్లి ఉప ఆరోగ్య కేంద్రం, లక్ష్మీపురం ఉప ఆరోగ్య కేంద్రంలోని గోపాల్ రావుపెల్లిలోని ఆరోగ్య కార్యక్రమాలను డీఎంహెచ్‌ఓ ఎస్. రజిత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉప ఆరోగ్య కేంద్ర పరిధిలో అందుతున్న సేవలు, మాతా శిశు సంరక్షణ, రక్తపోటు, మధ-ుమేహ వ్యాధులపై అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు కేంద్ర ఆరోగ్య కార్యక్రమాలపై లక్ష్యాలు సాధించాలని, ఆరోగ్య సేవలో నిర్లక్ష్యం వహించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో చీర్లవంచ సూపర్‌వైజర్ రాజు, సీహెచ్‌ఓ లు బాలచంద్రం, సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీల బహుమతులు ప్రదానం



**ప్రజానావ, హుస్నాబాద్:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ రోజున మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న మహిళలకు శనివారం మంత్రి ఆదేశాల మేరకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, పురపాలక సంఘ చైర్‌పర్సన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ ఐలేని అనిత రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, గోవిందు రవి, బొజ్జ హరీశ్, భూక్య సరోజన, మాజీ వార్డ్ నెంబర్ పచ్చిమట్ల రాధ, చిత్తారి రవీందర్, ఎండీ హసన్, బూరుగు కృష్ణస్వామి, దుబాల శీను,పెరుమండ్ల నర్సాగౌడ్, కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

**ప్రజానావ, హుస్నాబాద్:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో బాధిత కుటుంబాలకు మాజీ సర్పంచ్ పెండల పోచమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు పెండల రాజు అండగా ఉంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం ఇటీవల మరణించిన గడ్డం స్వరూప కుటుంబానికి 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఆకలితో ఉన్నవారికి సేవ చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.




ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

6 ఆదివారం 26 జనవరి 2025

# పారదర్శకంగా పథకాలు అందించాలి

- ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- నేడు లబ్ధిదారులకు సంక్షేమ పథకాల అందజేయనున్న మంజూరి పత్రాలు





**ప్రజానావ, ఆసిఫాబాద్:** ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలులో పారదర్శకంగా ఎంపికైన గ్రామాలలో లబ్ధిదారులకు పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శనివారం హైదరాబాద్ లోని అంబేద్కర్ సచివాలయం నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని లాంఛనంగా ప్రారంభించనున్న పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి చేపట్టవలసిన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలను అర్హులైన వారికి అందజేసేందుకు ఒక మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేయాలని తెలిపారు. ఎంపిక చేయబడిన గ్రామాలలో గణతంత్ర దినోత్సవం రోజున లాంచనంగా పథకాలు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, షామియానా, వేదిక అలంకరణ, మైక్, కుర్చీలు, స్క్రీన్, త్రాగునీరు ఇతర ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన లబ్ధిదారులకు పథకాలకు సంబంధించిన మంజూరి పత్రాలు అందజేయాలని, కార్యక్రమాలలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పథకాల అమలులో భాగంగా జిల్లాలోని మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 1 గంటలకు అర్హులైన ప్రతి లబ్ధిదారులకు పథకాలు మంజూరి పత్రాలు అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, సంక్షేమ పథకాలు జిల్లాలోని అర్హులందరికీ అందించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ సీట్లను కైవసం చేసుకుందాం

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్ల ఇండ్లకు వెళ్లండి

కాంగ్రెస్ మోసాలను ఎండగట్టండి: బండి సంజయ్



**ప్రజానావ, కరీంనగర్:** ప్రధాని మోడీ ఆధ్వర్యంలో దేశాభివృద్ధి శరవేగంగా జరుగుతోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మోడీ పాలనలోనే పట్టభద్రులు, ఉపాధ్యాయులుసహా అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని చెప్పారు. రోజ్ గార్ మేళా పేరుతో ఇచ్చిన హామీ మేరకు ఎక్కడా అవినీతి ఆరోపణలకు తావులేకుండా 9 లక్షల 25 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో నూతనంగా నియమించిన బీజేపీ మండలాధ్యక్షులు, ఆఫీస్ బేరర్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమరయ్య, గోదావరి అంజిరెడ్డితో పాటు కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, ప్రతాప రామక్రిష్ణ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్ డి.శంకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమరయ్య, గోదావరి అంజిరెడ్డి లను సమావేశానికి హాజరైన నేతలకు గంగాడి క్రిష్ణారెడ్డి పరిచయం చేశారు. ఈసారి ఎలాగైనా రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకునే దిశగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేసి టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడగాలని కోరారు. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల పేరుతో చేసిన మోసాలను వివరించాలన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాల భర్తీ, పీఆర్సీ పెంపు, 317 జీవో సవరణ, డీఏ బకాయిల చెల్లింపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ హామీలను తుంగలో తొక్కిన అంశాన్ని విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.

# గొర్రెల కాపరి కుటుంబం నుంచి అసిస్టెంట్ ఇంజనీర్‌గా..

అత్యున్నత స్థాయి ఉద్యోగం సాధించిన బోడపట్ల రజిత

కురుమ సంఘం ఆధ్వర్యంలో సత్కారం



**ప్రజానావ, బెజ్జంకి:** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారం గ్రామానికి చెందిన బోడపట్ల మొండయ్య, మల్లవ్వ దంపతుల చిన్న కూతురు రజిత నీటి పారుదల శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఎంపికైంది. ఈ సందర్భంగా గ్రామ కురుమ సంఘం ఆధ్వర్యంలో శనివారం రజితను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొర్ర సురేశ్ కుమార్ హాజరై మాట్లాడారు. రజిత అత్యున్నత స్థాయి ఉద్యోగం పొందడంపై హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల కష్టానికి ఇది ప్రతిఫలమని, పిల్లలు ఎదిగి ప్రయోజకులైనప్పుడే వారికి నిజమైన ఆనందమన్నారు. రజిత భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర కమిటీ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక, రాజకీయ నాయకులు పెద్దోల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పుల్ల పోచయ్య, పీపీఈల్ నాయకులు చిలుముల మోహన్, కురుమ సంఘం అధ్యక్షుడు పెద్ది మల్లేశం, పెద్దోల్ల రాజు కుమార్, గుంటి మల్లయ్య, పర్స నాగరాజు, కొని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఎన్ఆర్ఐల విరాళం

**ప్రజానావ, వేములవాడ:** 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఓర్లాండో, సిడ్నీ దేశాలకు చెందిన ఎన్ఆర్ఐలు పులిజాల శ్రవణ్‌కుమార్ రూ.50వేల విలువైన క్రీడా దుస్తులు, పెంటరెడ్డి ప్రశాంత్ రూ.30వేలు విలువ చేసే షూలు విరాళంగా అందించారు. అలాగే ఈగ అరుణ్ భావన, వేముల వినీల్ అనుష, మీనాక్షి శ్రీకాంత్‌లు సైతం విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ భన్నాజీ, ఐదో వార్డు కౌన్సిలర్ జడల లక్ష్మి శ్రీనివాస్, 6వ వార్డు కౌన్సిలర్ నీలం కల్యాణి శేఖర్, ప్రధానోపాధ్యాయురాలు వత్సల, ఏఏపీసీ చైర్మెన్ సంగెపు లత, ఉపాధ్యాయులు ఉమాదేవి, జ్యోతి, రజిత, వినయ్ కుమార్, కమలాకర్ రెడ్డి, శైలజ, ప్రసన్న, సీఆర్పీ ఆకుల శ్రీనివాస్ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రాజెక్టులకు యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేయాలి

వామపక్ష ప్రజా సంఘాల నేతల డిమాండ్



**ప్రజానావ, బెల్లంపల్లి:** శిథిలావస్థలో ఉన్న ప్రాజెక్టులకు ప్రభుత్వం యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని వామపక్ష ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం బెల్లంపల్లిలోని టీడీపీ పట్టణ కార్యాలయంలో ప్రజాసంఘాల నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ జలసాధన సంఘం రాష్ట్ర కన్వీన ర్ నైనాల గోవర్ధన్ మాట్లాడుతూ ప్రాణహిత తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో శంకుస్థాపన చేసి, దానికి బీఆర్ అంబేద్కర్ ప్రాజెక్టుగా నామకరణం చేశారు. ఆనాడే దీనికోసం రూ.38వేల కోట్లు అయ్యే ఖర్చును 9 వేలకోట్లు ఖర్చు చేశారు. ఆ తర్వాత 2014లో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం మేడిగడ్డకు మార్చి, అన్నారం బ్యారేజీలను నిర్మించారు. బడ్జెట్‌ను ఏకంగా రూ.1.50 వేల కోట్లకు పెంచి కల్వకుంట్ల కుటుంబం, మెగా ఇంజినీరింగ్ కంపెనీకి వేల కోట్లు దోచిపెట్టారని విమర్శించారు. అయినా ఇప్పుడు ఆ నిర్మాణాలన్నీ శిథిలావస్థలో ఉన్నాయని, దానికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం సీపీఐయూ ప్రధాన కార్యదర్శి టీ. మణిరాం సింగ్, ఎండీ చాంద్ పాషా, కొత్తూరు నారాయణ, దూడ లక్ష్మి, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే ఆరోగ్యంలో మార్పు


ఇండియన్ సైకియాట్రిక్ సమ్మిట్‌లో ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి




**ప్రజానావ, కరీంనగర్:** మానసిక ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన పెంచినప్పుడే మార్పు సాధ్యమని మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన ఇండియన్ సైకియాట్రిక్ సమ్మిట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అనేక మంది మానసిక సమస్యతో తమతమవుతున్నారన్నారు. మనిషి మానసికస్థితిపై ఒత్తిళ్లు తీవ్ర ప్రభావం చూపిస్తాయని పేర్కొన్నారు. సమాజంలో రోజురోజుకు తీవ్రమవుతున్న మానసిక సమస్యలు, మానసిక ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అన్నివర్గాల ప్రజలు సైకియాట్రిక్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మానసిక ఆరోగ్యం పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ప్రముఖ వైద్య నిపుణులు, సైకియాట్రిస్టులు, ఆరోగ్య రంగ నిపుణులు పాల్గొన్నారు.

# సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించండి

కేంద్ర మంత్రి బండి సంజయ్ కు బంజారా సేవాలాల్ సంఘం నాయకుల విజ్ఞప్తి



**ప్రజానావ, కరీంనగర్:** సంత్ శ్రీ సేవలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించి ప్రతి ఏటా ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు నిన్న కరీంనగర్ లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. దేశంలోని 15కోట్ల చిలుకు జనాభా కలిగిన బంజారాలకు సేవాలాల్ మహారాజ్ ఆరాధ్యదైవమన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున సెలవు దినంగా ప్రకటించాలని ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా విషయాన్ని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా బండి సంజయ్ తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్ సింగ్ నాయక్, మెదక్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ నాయక్, రాష్ట్ర నాయకులు రాజు నాయక్, శభాష్ జాదవ్, రెడ్యా నాయక్, మోహన్ నాయక్, శ్రీనివాస్ చౌహాన్ తదితరులున్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజానావ, బెజ్జంకి:** పది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెజ్జంకి (ఎల్లంపల్లి) గ్రామస్తుడు బోనగిరి మహేందర్ తీవ్రంగా గాయపడిన విషయం విధితమే. ఆస్పత్రి ఖర్చుల భారాన్ని తీర్చడానికి, (2008-2009) బ్యాచ్ 10వ తరగతి స్నేహితులు ముందుకొచ్చారు. స్నేహితుల తరఫున మహేందర్ కుటుంబానికి శనివారం రూ.16,400 ఆర్థిక సాయం అందజేశారు.




# సునీల్‌రావుది అవినీతి చరిత్ర

బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

**ప్రజానావ, కరీంనగర్:** మేయర్ సునీల్ రావుది అవినీతి చరిత్ర అని, తాను పార్టీ మారనున్నట్లు ఐదు నెలల కిందే తాము చెప్పామని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అవినీతిమయమైన చరిత్ర, అధికార పార్టీలో ఉండాలన్నదే ఆయన తపన అని విమర్శించారు. తనను నమ్మిన మనిషిని వెన్నుపోటు పొడవడం ఆయన నైజమన్నారు. 2020 మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే గంగుల సహకారంతో బీఆర్ఎస్ అత్యధిక సీట్లు సాధిస్తే దొడ్డి దారిన మేయరైన చరిత్ర తనదని విమర్శించారు. ఐదేళ్లుగా నటించి ఇప్పుడు నమ్మిన వారిని మోసం చేశాడన్నారు. అధికారయావతోనే బీజేపీ కండువా కప్పుకున్నాడని మండిపడ్డారు. పార్టీ మారతూ ఓటమి ఎరగని గంగుల కమలాకర్ పై అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని, మళ్లీ అసత్య ఆరోపణలు చేస్తే నాలుకను కోస్తామని హెచ్చరించారు. వెంటనే ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, కోఆప్షన్ మెంబర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్చార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ శని వదిలింది

గుంజపడుగు హరిప్రసాద్



**ప్రజానావ, కరీంనగర్:** మేయర్ సునీల్ రావు రూపంలో బీఆర్ఎస్ పార్టీకి పట్టిన శని వదిలిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ పేర్కొన్నారు. నమ్మినవారిని వెన్నుపోటు పొడవమే సునీల్‌రావు నైజమని, నమ్మి పదవి ఇచ్చిన బోయినపల్లి వినోద్, గంగుల కమలాకర్ నే వెన్నుపోటు పొడిచాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో రాజకీయంగా ఎదిగి అక్కడా మోసం చేసి, బీఆర్ఎస్‌లో చేరిన సునీల్ రావు మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ పార్లమెంట్ సభ్యులు ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ వద్ద నమ్మకంగా ఉండి పదవులు పొందారన్నారు. పదవీకాలం ముగియగానే నిన్నటి వరకు బీజేపీని తిట్టిన సునీల్ రావు కేసుల భయంతో ఆ పార్టీలోనే చేరుతున్నారని విమర్శించారు.

# తిలక్ ఒంటరి పోరాటం

## రెండో టీ20లో భారత్ ఉత్కంఠ విజయం



**చెన్నై:** ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా జోరు కొనసాగుతోంది. చెన్నై వేదికగా శనివారం జరిగిన రెండో టీ20లోనూ టీమిండియా రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో తెలుగు తేజం తిలక్ వర్మ ఒంటరి పోరాటంతో టీమిండియా విజయాన్నందుకుంది. ఓటమి తప్పదనుకున్న పరిస్థితుల్లో తిలక్ అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శన చేశాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 165 పరుగులు చేసింది. మరోసారి కెప్టెన్ జోస్ బట్లర్(30 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సలతో 45) టాప్ స్కోరర్‌గా నిలవగా.. బ్రైడన్ కార్స్(17 బంతుల్లో ఫోర్లు, 3 సిక్సలతో 31) విలువైన పరుగులు చేశాడు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు తీయగా.. అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, అభిషేక్ శర్మలకు తలో వికెట్ దక్కింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత్ 19.2 ఓవర్లలో 8 వికెట్లకు 166 పరుగులు చేసి గెలుపొందింది. తిలక్ వర్మ (55 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సలతో 72 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు. వాషింగ్టన్ సుందర్(19 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 26) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్(3/29) మూడు వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్, మార్క్ వుడ్, ఆదిల్ రషీద్, ఓవర్టన్, లివింగ్ స్టోన్ తలో వికెట్ తీసారు. తిలక్ వర్మ పోరాటాన్ని విరాట్ కోహ్లీ.. మెల్ బోర్న్‌లో ఆడిన ఐకానిక్ ఇన్నింగ్స్‌తో అభిమానులు పోలుస్తున్నారు.

### నిరాశపరిచిన ఓపెనర్లు

166 పరుగుల లక్ష్యఛేధనకు దిగిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు సంజూ శాంసన్(5), అభిషేక్ శర్మ(12) వరుస ఓవర్లలో పెవిలియన్ చేరారు. మార్క్ వుడ్ బౌలింగ్‌లో అభిషేక్ శర్మ వికెట్ల ముందు దొరికిపోగా.. సంజూ శాంసన్‌ను జోఫ్రా ఆర్చర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ భారీ సిక్సలు బాదడంతో వేగంగా పరుగులు వచ్చాయి. మరో ఎండ్‌లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(12)ను బ్రైడన్ కార్స్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో పవర్ ప్లేలో టీమిండియా 3 వికెట్లకు 59 పరుగులు చేసింది. పవర్ ప్లే అనంతరం భారత్ వరుసగా వికెట్లు కోల్పోయింది. ధ్రువ్ జురెల్(4), హార్దిక్ పాండ్యా(7) తీవ్రంగా నిరాశపర్చారు. దాంతో భారత్ 78 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

### వాషింగ్టన్‌తో కలిసి..

ఈ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్‌తో కలిసి తిలక్ వర్మ జట్టును ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో అతను 38 బంతుల్లో 50 పరుగులు చేశాడు. సుందర్ ఇచ్చిన సునాయస క్యాచ్‌ను ఆదిల్ రషీద్ నేలపాలు చేయగా.. అతను ఓ భారీ సిక్స్‌తో పాటు బౌండరీ బాదాడు. సుందర్(26)ను కార్స్ క్లీన్ బౌల్డ్ చేయగా.. అక్షర్ పటేల్(2)ను లివింగ్ స్టోన్ ఔట్ చేశాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు తిలక్ వర్మ పోరాడాడు. భారీ షాట్ ఆడే క్రమంలో అర్ష్‌దీప్ సింగ్(6) కూడా ఔటవ్వగా.. రవి సాయంతో తన పోరాటాన్ని కొనసాగించాడు. దాంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. 19వ ఓవర్‌లో రవి బౌండరీ బాదడంతో భారత్‌పై ఒత్తిడి తగ్గింది. చివరి ఓవర్‌లో భారత్ విజయానికి 6 పరుగులు అవసరమవ్వగా.. తొలి బంతికి క్విక్ డబుల్ తీసిన తిలక్ వర్మ.. బౌండరీ బాది విజయ లాంఛనాన్ని పూర్తి చేశాడు.



## ఆ ముగ్గురిలో ఎవరు లేకున్నా.. టీమిండియాలో నాయకత్వ శూన్యత : అశ్విన్

**చెన్నై:** ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ మొదలు కానుంది. భారత జట్టును రోహిత్ శర్మ నడిపిస్తాడు. అతడికి డిప్యూటీగా యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ మేనేజ్‌మెంట్ నియమించింది. ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ఐసీసీ టోర్నీలో రోహిత్ శర్మకు గాయమైతే టీమ్‌ఇండియాలో నాయకత్వ శూన్యత వచ్చే ప్రమాదం లేకపోలేదని మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ వ్యాఖ్యానిం చాడు. 'భవిష్యత్తులో భారీ బాధ్యతలను పూరించాల్సిన పరిస్థితి ఉంది. ఈ విషయంలో నేను నిజాయితీగా ఓ మాట చెప్పాలనుకుంటున్నా. ఒకవేళ రోహిత్ గాయపడితే.. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌ను శుభ్‌మన్ గిల్ నడిపించాల్సి ఉంటుంది. ఆ విషయంలో నేను కాస్త ఆందోళన చెందుతానని చెబుతున్నా. అతడు గుజరాత్ టైటాన్స్‌కు సారథిగా ఉన్నాడు. యువకుడిగా ఉన్నప్పుడే కెప్టెన్సీ వైపు అడుగులు వేశాడు. కానీ, అండర్ -19 ప్రపంచకప్‌లో గిల్ నాయకత్వం వహించలేదు. పృథ్వీ షా జట్టును నడిపించాడు. అదంతా ముగిసిపోయిన చరిత్ర. ఇప్పుడు భవిష్యత్తు గురించే మాట్లాడుకోవాలి. ఎందుకంటే ఇది అర్థ వంతమైన చర్చనీయాంశమని నేను భావిస్తున్నా. అసంబద్ధమని అనుకోవడం లేదు. రాబోయే కాలంలో నాయకత్వ కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. రోహిత్, విరాట్, బుమ్రాలో ఎవరో ఒకరు లేకపోతే.. భారత్‌కు కెప్టెన్‌గా ఎవరు ఉంటారనేది అతి పెద్ద ప్రశ్న" అని అశ్విన్ తెలిపాడు. "ప్రస్తుత తరం క్రికెటర్లను నేను చాలా దగ్గరగా గమనించా. వారందరూ నేర్చుకొనే క్రమంలోనే ఉన్నారు. వారికి నాయకత్వానికి సంబంధించిన ప్రాథమిక అంశాలను నేర్పించాల్సిన అవసరం ఉంది. రిషభ్ పంత్ వీరిలో కాస్త బెటర్ అనిపిస్తాడు. కానీ, మేనేజ్‌మెంట్ దృష్టిలో లేనట్లుంది. శుభ్‌మన్ గిల్ ఈ రేసులో దూసుకొచ్చాడు. కానీ, అతడు ఇంకా నేర్చుకోవాలి. జట్టు అంతర్గత అభిప్రాయం మేరకు గిల్‌కు డిప్యూటీగా ఛాన్స్ ఇచ్చి ఉండొచ్చు. ఇక్కడ ప్రతి అంశాన్ని విడదీసి చెప్పలేను. భవిష్యత్తు సారథ్యం దృష్ట్యా గిల్‌ను ప్రయత్నించి ఉండొచ్చని భావిస్తున్నా"అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.

## అతడి ఆటను చూస్తూ పెరిగా..

### రోహిత్ కోసం ఆయుష్ మాత్రే త్యాగం

**చెన్నై:** అంతకుముందు మ్యాచ్‌లో సెంచరీ సాధించిన క్రికెటర్‌కు తప్ప కుండా అవకాశం దక్కుతుంది. కానీ, సీనియర్ కోసం తన ప్లేస్‌ను త్యాగం చేయాల్సిన పరిస్థితి దేశవాళీ క్రికెటర్ 17 ఏళ్ల ఆయుష్ మాత్రేకు మాత్రమే వచ్చింది. అదీనూ.. టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ కోసమైతే అదెంతో ప్రత్యేకంగా నిలవడం ఖాయం. రంజీ ట్రోఫీలో భాగంగా జమ్మూకశ్మీర్‌తో మ్యాచ్‌లో రోహిత్ శర్మ బరిలోకి దిగాడు. అతడితోపాటు భారత యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ కూడా ఆడాడు. వీరిద్దరూ ఓపెనింగ్ చేశారు. మొదటి ఇన్నింగ్స్‌లో సింగిల్ డిజిట్‌కే పరిమితమైన ప్పటికీ.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కాస్త మెరుగైన ప్రదర్శనే చేశారు. ఈక్రమంలో రోహిత్ కోసం ఆయుష్ తన ఓపెనింగ్ ప్లేస్‌ను వదులుకొని బెంచ్‌కే పరిమితమయ్యాడు. తాజాగా తన సంతోషం వ్యక్తంచేస్తూ ఆయుష్ సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టాడు. "రోహిత్ ఆటను చూస్తూ పెరిగా. టీవీల్లో అతడి బ్యాటింగ్‌ను చూశా. ఇప్పుడు డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకోవడం చాలా ఆనందంగా ఉంది. నా మార్గదర్శితో ఉండటం ప్రత్యేకమైన అనుభూతి. ఎన్నో విషయాలను నేర్చుకొని ముందుకు సాగుతా" అని ఆయుష్ వ్యాఖ్యలు జోడించాడు. ఆయుష్ మాత్రే ఇప్పటివరకు కేవలం 6 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లను మాత్రమే ఆడాడు. అయితే, 441 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ ఉన్నాయి. 40 సగటుతో రాణించిన ఆయుష్ అత్యధిక వ్యక్తిగత స్కోరు 176.



## ఐసీసీ టీ20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా అర్ష్‌దీప్ సింగ్

**దుబాయ్:** భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 2024 సంవత్సరానికిగాను ఐసీసీ టీ20 ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికయ్యాడు. సికిందర్ రజా (జింబాబ్వే), ట్రావిస్ హెడ్(ఆస్ట్రేలియా), బాబర్ అజామ్ (పాకిస్థాన్)తో పోటీపడి ఈ అవార్డు దక్కించుకున్నాడు. గతేడాది అర్ష్‌దీప్ అద్భుత ప్రదర్శన చేశాడు. 18 మ్యాచ్‌ల్లోనే 36 వికెట్లు పడగొట్టి భారత్ తరఫున టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. 2024 టీ20 ప్రపంచ కప్‌లో భారత్ విజేతగా నిలవడంలో ఈ యువ పేసర్ కీలకపాత్ర పోషించాడు. ఎనిమిది మ్యాచ్‌ల్లో 7.16 ఎకానమీతో 17 వికెట్లు తీశాడు. యూఎస్ఏతో జరిగిన మ్యాచ్‌లో (4/9) సంచలన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అంతేకాదు భారత్ తరఫున పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు (97) తీసింది కూడా అర్ష్‌దీపే. ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టీ20లో రెండు వికెట్లు పడగొట్టి ఈ ఘనత సాధించాడు. ఇతను మరో 3 వికెట్లు సాధిస్తే టీ20ల్లో 100 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా రికార్డుల్లోకెక్కుతాడు.

## టీ20 టీమ్ ఆఫ్ ది ఇయర్ 2024..

## కెప్టెన్‌గా రోహిత్ శర్మ



**దుబాయ్:** గతేడాది అంతర్జాతీయ టీ20ల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన 11 మంది క్రికెటర్లతో కూడిన జట్టును ఐసీసీ తాజాగా ప్రకటించింది. దీనికి కెప్టెన్‌గా భారత జట్టు సారథి రోహిత్ శర్మను ఎంపిక చేయడం విశేషం. ఇక, ఈ జట్టులో భారత్ నుంచి మరో ముగ్గురు ఆటగాళ్లకూ చోటు దక్కింది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య, లెఫ్ట్-ఆర్మ్ సీమర్ అర్ష్‌దీప్ సింగ్ ఈ జాబితాలో ఉన్నారు. గతేడాది టీ20ల్లో రోహిత్ శర్మ అటు సారథిగా.. ఇటు బ్యాట్స్‌మన్‌గా మెరుగైన ప్రదర్శన చేశాడు. 11 మ్యాచ్‌ల్లో 42 సగటుతో 378 పరుగులు సాధించాడు. 2024లో జరిగిన పొట్టి కప్పు మెగా సమరంలో టీమ్‌ఇండియా విశ్వవిజేతగా అవతరించడంలో రోహిత్ కీలక పాత్ర పోషించాడు. ఆ టోర్నీలో మూడు అర్ధశతకాలతో పాటు సూపర్ 8 దశలో ఆస్ట్రేలియాపై 92 పరుగులతో అదరగొట్టాడు. ఇక, సీనియర్ పేసర్ బుమ్రా అద్భుతంగా రాణించాడు. గతేడాది 8 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసి.. ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపించాడు. యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 2024లో అత్యంత కీలకమైన వికెట్ టేకర్‌గా అవతరించాడు. 18 మ్యాచ్‌ల్లో 13.50 సగటుతో 36 వికెట్లు తీసి అదరగొట్టాడు. హార్దిక్ పాండ్య 17 మ్యాచ్‌ల్లో 16 వికెట్లు తీయడంతో పాటు 352 పరుగులతో ఆల్‌రౌండర్లలో టాప్ ర్యాంకర్‌గా నిలిచాడు.

### ఐసీసీ టీ20 టీమ్ ఆఫ్ ది ఇయర్ 2024 ఇదే..

రోహిత్ శర్మ (కెప్టెన్‌బీ భారత్), ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా), ఫిల్ సాల్ట్ (ఇంగ్లాండ్), బాబర్ అజామ్ (పాకిస్థాన్), నికోలస్ పూరన్ (వికెట్ కీపర్‌బీ వెస్టిండీస్), సికందర్ రజా (జింబాబ్వే), హార్దిక్ పాండ్య (భారత్), రషీద్ ఖాన్ (అఫ్గానిస్థాన్), వానిందు హసరంగ (శ్రీలంక), జస్ప్రీత్ బుమ్రా (భారత్), అర్ష్‌దీప్ సింగ్ (భారత్)

# పతకాలతో తిరిగి రావాలి

## జాతీయ క్రీడల్లో తెలంగాణ పతకాల పంట సాధించాలి

### స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి.. జాతీయ క్రీడల్లో పాల్గొంటున్న వారికి కిట్ల అందజేత

**ప్రజానావ, హైదరాబాద్ స్పోర్ట్స్:** ఉత్తరాఖండ్‌లో ఈనెల28 నుంచి జరగబోతున్న జాతీయ క్రీడల్లో పాల్గొంటున్న 22 క్రీడాంశాల్లో తప్పకుండా పతకాలు సాధించాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. ఉత్తరాఖండ్ లో జరగబోతున్న 38వ జాతీయ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు శనివారం ఎల్బీ స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరఫున స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేరళ, గుజరాత్, గోవాలో జరిగిన జాతీయ క్రీడల్లో రాష్ట్రం ఆశించిన ఫలితాలు రాబట్టలేక పోయిందని, గతేడాది కాలంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తున్న ప్రోత్సాహంతో క్రీడాకారుల్లో నూతనోత్సాహం నెలకొందన్నారు. ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 22 క్రీడాంశాల్లో తెలంగాణ తప్పకుండా పతకాలు సాధిస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. వచ్చే జాతీయ క్రీడలను హైదరాబాద్‌లో నిర్వహించేలా రాష్ట్రం తరఫున తమవంతు ప్రయత్నాలు చేస్తామని తెలిపారు.

### ఈసారి మెరుగైన ప్రదర్శన

రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న జాతీయ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు అవసరమైన కిట్లను సమకూర్చడంతో పాటు డీఏను పెంచినట్లు చెప్పారు. అదేవిధంగా పథకాలు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలు కూడా పెంచడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గతంలో కంటే ఈసారి తెలంగాణ మెరుగైన ప్రదర్శన ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఎండీ, తెలంగాణ టీమ్ చీఫ్ డీ. మిషన్, సోనీ బాలాదేవి మాట్లాడుతూ ఈ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తెలంగాణ స్పోర్ట్స్ తరఫున అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, మాజీ కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పాల్గొన్నారు.




# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..




## బాలీవుడ్‌ని ఒకేతాటి పైకి తీసుకొస్తా



హిందీ చిత్ర పరిశ్రమను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు నటుడు అక్షయ్‌కుమార్. ఇండస్ట్రీలో ఐకమత్యం లోపించిందని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు. అవకాశం వస్తే ఇండస్ట్రీలో అందరినీ ఒక్కతాటిపైకి తీసుకొస్తానని అన్నారు. “అవకాశం వస్తే ఇండస్ట్రీలో ఏం మార్పులు చేయాలనుకుంటున్నారు?” అని తన ‘స్కైఫోర్స్’ కోస్టార్ వీర్ పహారియా ప్రశ్నించగా ఆయన ఈమేరకు ఇలా బదులిచ్చారు. “మన ఇండస్ట్రీకి సంబంధించిన ఏదైనా మార్చే అవకాశం నాకు వస్తే.. పరిశ్రమ మరింత ఐక్యంగా ఉండేలా చేస్తాను. మనమంతా ఒకటే కుటుంబమే అయినప్పటికీ కొన్ని విషయాల్లో ఐక్యత లోపించిందని అనిపిస్తుంది. ఇతరులతో సంబంధాలు లేకుండా షూట్స్ చేస్తున్నాం. దీంతో రానురాను దూరం పెరుగుతోంది. మనందరం కలిసి పని చేయాలి. ఒకరి సినిమాని మరొకరు సపోర్ట్ చేయాలి. ప్రతీ విజయాన్ని అందరూ సెలబ్రేట్ చేసుకోవాలి. సవాళ్లు ఎదురైనప్పుడు అందరూ కలిసి వాటికి పరిష్కారాలను ఆలోచించాలి. మనందరం కలిసిఉంటే ఇండస్ట్రీపై మంచి ప్రభావం చూపిస్తుంది” అని అక్షయ్ అన్నారు. ఇదేతరహా అభిప్రాయాన్ని ఇటీవల అజయ్‌దేవ్‌గణ్ సైతం తెలిపారు. ఇండస్ట్రీలో యూనిటీ తగ్గిందని ఆయన చెప్పారు. “దక్షిణాదిలో ఏదైనా సినిమా విడుదలైతే నటీనటులంతా ఒకేతాటిపైకి వచ్చి దాన్ని ప్రమోట్ చేస్తారు. అది నాకెంతో నచ్చింది. నిజంగా అది మెచ్చుకోవాల్సిన విషయం. హిందీ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఆ ఐక్యతే కొరవడింది. ఇండస్ట్రీలో ఐక్యత ఉండాలని నేను ఎప్పుడూ కోరుకుంటా” అని ఇటీవల ఓ ప్రెస్‌మీట్‌లో అజయ్ చెప్పారు. ఇక ‘స్కైఫోర్స్’ సినిమా విషయానికి వస్తే.. అక్షయ్‌కుమార్, వీర్ పహారియా, సారా అలీఖాన్, నిమ్రత్ కౌర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. సందీప్ కేవ్లానీ, అభిషేక్ అనిల్‌కపూర్ దర్శకత్వంలో ఇది రూపుదిద్దుకుంది. 1965లో జరిగిన భారత్–పాకిస్థాన్ వైమానిక యుద్ధం నేపథ్యంలో సాగే చిత్రమిది. ఆ యుద్ధంలో కనిపించకుండా పోయిన భారత వైమానికదళం స్క్వాడ్రన్ లీడర్ అజ్జమడ బొప్పయ్య దేవయ్య సాహసపోరాటం స్ఫూర్తిగా ఈ కథను సిద్ధం చేశారు. శుక్రవారం ఇది విడుదలైంది.

## ‘అఖండ 2’ కోసం..

కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు బోయపాటి శ్రీను కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం ‘అఖండ 2: తాండవం’. వీళ్ల కలయికలోనే వచ్చిన విజయవంతమైన సినిమా ‘అఖండ’కు కొనసాగింపుగా ముస్తాబవుతోంది. రామ్ ఆచంట, గోపి ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని సమర్పిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కోసం ఓ నాయికగా సంయుక్తా మేనన్‌ను ఎంపిక చేసింది చిత్ర బృందం. ఈ విషయాన్ని శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. బాలయ్యతో సంయుక్తకి ఇదే తొలి చిత్రం. ఇందులో ఆమెది నటనకు ప్రాధాన్యమున్న పాత్రని తెలుస్తోంది. కథకు కీలకంగా నిలవనున్నట్లు తెలిసింది. ఈ చిత్రం ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. ఈ షెడ్యూల్‌లో బాలయ్య – సంయుక్తలపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఈ సినిమా సెప్టెంబరు 25న థియేటర్లలోకి రానుంది. దీనికి తమన్ సంగీతమందిస్తుండగా.. సి.రామ్ ప్రసాద్, సంతోష్ డిటాకే ఛాయాగ్రాహకులుగా వ్యవహరిస్తున్నారు.



## రాజమౌళి చేతిలో మహేశ్ పాస్‌పోర్ట్..



మహేశ్‌బాబు అభిమానులు ఎప్పుడెప్పుడా? అని ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చేసింది. ఆయన కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ఓ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్ ఇస్తూ ఇన్‌స్టా వేదికగా దర్శకుడు రాజమౌళి వీడియోను పంచుకున్నారు. అందులో సింహాన్ని బోనులో బంధించినట్లు, పాస్‌పోర్ట్ చూపిస్తూ కనిపిం చారు. శుక్రవారం రాత్రి రాజమౌళి ఈ పోస్ట్ చేయగా, తెల్లవారి లేచి చూసేసరికి సోషల్‌మీడియా మొత్తం మహేశ్ కొత్త సినిమాకు సంబంధించిన పోస్టులు, మీమ్స్‌తో సందడి చేయడం మొదలైంది. మహేశ్‌బాబు ఏమాత్రం కాస్త ఖాళీ దొరికినా కుటుంబంతో కలిసి, విహారయాత్రకు విదేశాలకు వెళ్లిపోతుంటారు. రాజమౌళి సినిమా అంటే కీలక నటీనటులు, సాంకేతిక నిపుణులకు మరో కమిట్‌మెంట్ ఉండదు. ఆయన సినిమా పూర్తయ్యే వరకూ మరో సినిమా చేసే అవకాశాలు కూడా ఉండవు. అంతలా డెడికేషన్ పెట్టాల్సిందే. మహేశ్‌బాబు పాస్‌పోర్ట్ ఇప్పుడు రాజమౌళి చేతుల్లో ఉందంటే, సినిమా షూట్ పూర్తయ్యేవరకూ ఆయన లాక్ అయినట్లే. ఆ సింబాలిక్‌గానే సింహాన్ని బంధించినట్లు వీడియోను క్రియేట్ చేశారు. ఇక బ్యాగ్రౌండ్‌లో ‘స్పైడర్’ మూవీలో మ్యూజిక్‌ను వాడారు.

## సక్సెస్ కోసం.. రాజీపడ్డా : రష్మిక



దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ చిత్రాలు చేస్తున్నారు నటి రష్మిక. వరుస విజయాలతో కెరీర్‌లో దూసుకెళుతున్నారీ భామ. సక్సెస్ కోసం తాను ఒక విషయంలో రాజీ పడ్డానని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. కుటుంబానికి సమయాన్ని ఎక్కువగా కేటాయించ లేకపోతున్నందుకు బాధపడుతున్నానని అన్నారు. తన కెరీర్ విషయంలో కుటుంబసభ్యులు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. సక్సెస్ కోసం ఎంతో శ్రమించాలని.. ఆ సమయంలో కొన్ని విషయాల్లో రాజీ పడాల్సి ఉంటుందని ఆమె చెప్పారు. “కెరీర్ పరంగా బిజీగా ఉండడం వల్ల కుటుంబంతో వీలైనంత ఎక్కువ సమయం గడపలేకపోతున్నా. ఈ ప్రయాణంలో నేను రాజీపడిన అతిపెద్ద విషయం ఇదే. వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలకు ఒకేసారి సమయాన్ని కేటాయించడం అంత సులభం కాదు. ఒకదాని కోసం మరొకటి త్యాగం చేయాల్సి ఉంటుంది. అని కెరీర్‌లోకి అడుగుపెట్టిన సమయంలో మా అమ్మ చెప్పిన మాట నాకింకా గుర్తుంది. వృత్తిపరమైన కమిట్‌మెంట్స్ నిలబెట్టుకోవడానికి ఫ్యామిలీ టైమ్ త్యాగం చేయాల్సి ఉంటుంది” అని చెప్పింది. “కుటుంబమే నా బలం. కీలక సమయాలను కుటుంబంతోనే గడుపుతా. నా చెల్లి అంటే నాకెంతో ఇష్టం. ప్రతిరోజూ మేమిద్దరం మెసేజ్‌లు చేసుకుంటాం. వరుస షూటింగ్స్ వల్ల తనతో గడిపే సమయాన్ని ఎంతగానో మిస్ అవుతున్నా. తను చాలా స్మార్ట్. రానున్న రోజుల్లో అద్భుతమైన మహిళగా మారనుందని నమ్ముతున్నా. వీలున్నప్పుడల్లా కుటుంబసభ్యులకు ఫోన్ చేసి మాట్లాడుతుంటా” అని రష్మిక చెప్పారు. ‘



## ‘రాజాసాబ్’ తర్వాత ప్రేక్షకులు నాపై అభిప్రాయం మార్చుకుంటారు : నిధి అగర్వాల్

ఇద్దరు అగ్ర హీరోల సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు హీరోయిన్ నిధి అగర్వాల్. పవన్ సరసన ‘హరిహర వీరమల్లు’లో, ప్రభాస్‌తో ‘రాజా సాబ్’లోను నటిస్తున్నారు. ఈ రెండు సినిమాలు ఎప్పుడు రిలీజ్ అవుతాయా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన నిధి ‘రాజాసాబ్’లో తన పాత్ర గురించి మాట్లాడారు. చాలా గొప్ప పాత్ర అని చెప్పారు. “ప్రేక్షకులు ఎక్కువగా నా నుంచి గ్లామర్ పాత్రలు ఆశిస్తారు. నేను కూడా అలాంటి పాత్రలే ఎక్కువగా చేస్తానని భావిస్తారు. రాజాసాబ్‌తో ప్రజలు నాపై ఉన్న ఈ అభిప్రాయాన్ని మార్చుకుంటారని నేను కచ్చితంగా చెప్పగలను. ఈ సినిమాలో నా పాత్ర రెగ్యులర్ హాట్ పాత్రలకు భిన్నంగా ఉంటుంది. ఇది అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఇందులో నా పాత్రను ప్రేక్షకులు ఊహించలేరు” అని చెప్పారు. దీంతో ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. మారుతి దర్శకత్వంలో రాజా సాబ్ రానుంది. ప్రభాస్ (%ూతీఖఎష్ట్రుం%) మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో అందరి దృష్టి ఈ చిత్రంపైనే ఉంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయ్ దత్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్న ఈ మూవీ వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకురానుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా గురించి సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ.. “ఇది చాలా మాస్ ఆల్బమ్. చాలా రోజుల తర్వాత హీరో ఇంట్రడక్షన్ సాంగ్, డ్యూయెట్, ఐటెం సాంగ్, ముగ్గురు అమ్మాయిలతో ఒక పాట.. ఇలా చాలా రకాల సాంగ్స్ ఉన్నాయి. మంచి ఫాంటసీ చిత్రం. భారతీయ సినీ రంగాన్ని ఈ చిత్రం మరో స్థాయికి తీసుకెళ్తుంది. కామెడీ బాగుంది. వింటేజ్ ప్రభాస్‌ను చూస్తారు” అని చెప్పారు.

## సుకుమార్ కుమార్తెను మెచ్చుకున్న రామ్‌చరణ్ దంపతులు

**హైదరాబాద్:** ప్రముఖ దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘గాంధీ తాత చెట్టు’. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. సుకృతి వేణి నటనను సినీ ప్రియులు మెచ్చుకుంటున్నారు. మంచి సందేశాత్మక చిత్రాన్ని రూపొందించారంటూ చిత్రబృందాన్ని సినీ ప్రముఖులు, ప్రియులు ప్రశంసిస్తున్నారు. తాజాగా ఈ టీమ్‌ను నటుడు రామ్‌చరణ్ అభినందించారు. తన సతీమణి ఉపాసనతో కలిసి ఆయన చిత్రబృందాన్ని కలిశారు. సినిమా విశేషాల గురించి టీమ్‌తో మాట్లాడారు. సుకృతి వేణిని మెచ్చుకున్నారు. ఆమె మరెన్నో విజయాలు అందుకోవాలని కోరారు. దీనికి సంబంధించిన ఫొటోలను చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ టీమ్ ఎక్స్ వేదికగా షేర్ చేసింది.




Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**